సహజీవన భావనల పావురాయి

# గీటురాయి

వారపత్రిక 3-1-2025 15/-

# మాయమాటలు



సహజీవన భావాల సౌరభాలు
# గీటురాయి
వారపత్రిక

**GEETURAI WEEKLY**

Sandesha Bhavanam, Lakkadkot,
Chatta Bazar, Hyderabad-500 002.
Ph: 040-24564583; 24576237
Email : geeturaiweekly@gmail.com
Website: www.tiptrust.in; geeturai.in

సంపుటి: 47 సంచిక: 1 హైదరాబాద్
శుక్రవారం 3 జనవరి 2025 రూ.15-00
2 రజబ్ 1446 హిజ్రీ


**తొలిగీటు**

జనులారా! అల్లాహ్‌ను మీ తప్పులకు క్షమాపణకూ వేడుకోండి. ఆయన వైపు మరలండి. నేనయితే రోజుకు వందేసి మార్లు క్షమాపణకై అర్థిస్తూ ఉంటాను.

– మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం)


**సంపాదకులు**
**ఎస్.ఎమ్. మలిక్**

**అసోసియేట్ ఎడిటర్**
**అబ్దుల్ వాహెద్**

**ఎడిటోరియల్ ఇన్‌ఛార్జి**
**ముహమ్మద్ ముజాహిద్**

గ్రాఫిక్స్
**ఎల్. లక్ష్మీనారాయణ**
**ముహమ్మద్ రఫీఖ్**

సర్క్యులేషన్ మేనేజర్
**అబ్దుల్ జలీల్, 9704317015**

Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2023-2025 Phone: 24564583. **e-mail: geeturaiweekly@gmail.com**





## లోపల...


| | | |
|---|---|---|
| ఇదేమి అభిమానం | ...... | 04 |
| మాయమాటలు | ...... | 05 |
| క్యాన్సర్‌కు టీకా | ...... | 07 |
| 2025 పేజీని అందంగా రాయండి | ...... | 12 |
| పదిలంగా నిలిచిపోయిన జమాఅత్ జాతీయ సదస్సులు | ...... | 14 |
| వృద్ధులను గౌరవిద్దాం! | ...... | 17 |
| వెలుగుబాట (తఫ్‌హీముల్ ఖుర్‌ఆన్ అనువాదం) | ...... | 18 |
| అడుగుజాడలు | ...... | 19 |
| చరితార్థులు-2 : యన్. యం. ఖాజా మియాఁ రౌతార్ | ...... | 21 |
| 54,151 అధికారులలో ముస్లింలు 463 మంది మాత్రమే ముస్లిములు | ...... | 20 |
| చీకట్లను చీల్చిన జ్ఞానకిరణం ఫాతిమా షేక్ | ...... | 24 |
| ఇస్లామీయ ఉద్యమం దాని క్రమ వికాసం-1 | ...... | 26 |
| 9 విషయాలు | ...... | 28 |
| తేనెటీగ ఆదర్శం | ...... | 31 |
| సంక్షిప్త భారతం | ...... | 32 |
| సర్వత్రా | ...... | 33 |
| కరిగిపోక ముందే కళ్లు తెరుద్దాం! | ...... | 34 |


**కేజ్రీ vs భాజపా. ...**




(బీజేపీ నేతలు బహిరంగంగా డబ్బుపెట్టి ఓట్లు కొంటున్నారు. - అరవింద్ కేజ్రీవాల్ )

డబ్బుపెట్టి ఓట్లుకొనే
కుయుక్తి భా.జ.పాది
ఇంతకంటే నీచమైన
సంస్కృతి మరి ఏది!
అంతఖర్మ మాకేంటి
ఎమ్మెల్యేలనె చీలుస్తం
విపక్ష ప్రభుత్వాలను
నిలువున కూలుస్తం!!

**– యం.డి. ఉస్మాన్ ఖాన్**

# ఆలోచన

## ఇదేమి అభిమానం

పుష్ప 2 సినిమా బెనిఫిట్ షోలో జరిగిన తొక్కిసలాటలో ఒక మహిళ దుర్మరణం, ఆమె కుమారుడు తలకు తీవ్రమైన గాయంతో ఆసుపత్రిలో ఉన్నాడు. ఈ మొత్తం సంఘటనలో అల్లు అర్జున్ తప్పు ఎంత ఉందో న్యాయస్థానాలు చెబుతాయి. కాని ఆలోచించవలసిన ప్రశ్న మరొకటి ఉంది.

మన దేశంలో సినిమా హీరోల పట్ల వెర్రి అభిమానం ఉంది. మనం అత్యాధునిక కృత్రిమ మేధస్సు యుగంలో జీవిస్తున్నప్పటికీ వ్యక్తిపూజ కొనసాగుతూనే ఉంది. ఇప్పుడు సినిమా హీరోల ఆర్మీలు కూడా ఉన్నాయి. అభిమానులకు ఆర్మీ పేరు పెట్టడమేమిటో అర్థం కాని విషయం.

హీరోలకోసం పడిచావడం, హీరో కోసం ఘర్షణలకు దిగడం, కత్తులతో దాడుల వంటి వార్తలు మనం వింటూ వస్తున్నాం. అప్పులు చేసి వేలు పెట్టి టిక్కెట్టు కొని సినిమాకు వెళ్ళేవారున్నారు. అభిమాన హీరోకు పాలాభిషేకం చేయడానికి అప్పు చేసయినా ఖర్చుపెడతారు. రక్తతిలకాలు పెడతారు. ఇదంతా నేడు కొత్త కాదు. దశాబ్దాలుగా కొనసాగుతూ వస్తున్నదే. ఒకప్పుడు అభిమాన సంఘాలు ఉండేవి. ఇప్పుడు ఆర్మీలు తయారయ్యాయి. నిజం చెప్పాలంటే ఈ హీరోలకు రూపాయి ఖర్చు లేకుండా ప్రచారం చేసి పెట్టే వాళ్ళే ఈ హీరోల ఆర్మీలోని సైనికులు. గతం కన్నా ఇప్పుడు ఈ అభిమానం మరింత వెర్రితలలు వేస్తుందనిపిస్తోంది. హీరోనే దేవుడిగా చూసే స్థాయికి చేరుకుంటుంది. ఇది మనిషి తనను తాను అవమానించుకోవడంగా భావించాలి.

అన్నదానాలు, రక్తదానాలు చేయడం చాలా మంచి పని. కాని హీరోల కోసం అన్నదానాలు, రక్తదానాలు నిర్వహించడం జరుగుతుంటుంది. అన్నదానాలు రక్తదానాలు చేస్తున్నది ఎవరి కోసం? పేదల కోసం అన్నదానం చేస్తున్నారా? లేక హీరో కోసం, హీరో ప్రచారం కోసం అన్నదానం చేస్తున్నారా?

బ్లాక్‌లో అయినా టికెట్ కొని సినిమా చూడడం, సినిమా వందరోజులు, యాభై రోజులు ఆడించడానికి తమ జేబు నుంచి ఖర్చుపెట్టే అభిమానుల పిచ్చిని ఏమనాలి. సినిమా హీరోల అభిమానంతో ఫ్యాన్స్ అసోసియేషన్లు పెట్టడం, అందుకు లక్షల రూపాయల అప్పులు చేయడం దీన్నే మనాలి? ఇలా జీవితాలు నాశనమైన అభిమానులు ఎందరు? హీరోలు ఉండేది పాష్ కాలనీల్లో... అభిమానులు ఉండేది మురికివాడల్లోను, గుడిసెల్లోను, మెకానిక్ షెడ్ల లోను.

ఒక సినిమాకు హీరో వందల కోట్లు పారితోషికం తీసుకుంటాడు. అదే సినిమాలో పని చేసే లైట్ బాయ్ వేతనం గత అనేక సంవత్సరాలుగా ఎదుగుబొదుగు లేకుండా అలాగే పడి ఉంటుంది. రోజుకు వంద రూపాయలు కూడా సంపాదించలేని స్థితిలో ఉన్న ఫ్యాన్స్‌కి మాత్రం వంద కోట్లు పారితోషికం తీసుకునే హీరో అంటే పిచ్చి.

వాస్తవమేమిటంటే, సినిమాలో నటించే వారంతా నటులు మాత్రమే. వారిని హీరోలుగా మార్చేది ప్రేక్షకుల వెర్రి అభిమానం. ఒక హీరో ఎంత బలాఢ్యుడైనా వందలాది మందిని చావచితక కొట్టడం సాధ్యమా అని ఏ అభిమాని కూడా ఆలోచించడు. ఆ హీరో ఒక్కసారి కనబడితే చాలు జన్మ ధన్యం అన్నట్లు ఆలోచించడం ఎలాంటి వైఖరి. ఇదే వైఖరి పిల్లల్లోను ఉంటే ఆశ్చర్యమేముంది. పిల్లలు మంకు పట్టు పట్టి ఆ సినిమాకు వెళ్ళాలంటే వెళ్ళాలని మారాం చేస్తే పాపం ఆ అమాయకపు తల్లి కుమారుడిని తీసుకుని సినిమాకు వెళ్ళింది. ఆ తల్లి ఇప్పుడు లోకంలో లేదు. ఆ కుమారుడు ఆసుపత్రిలో ఎప్పుడు కన్ను తెరుస్తాడో తెలియదు.

ఈ బెనిఫిట్ షో కోసం ఒక్క టిక్కెట్టు వెల మూడువేల రూపాయలు. కుటుంబంలో ముగ్గురు ఈ సినిమాకు వస్తే మొత్తం తొమ్మిది వేల రూపాయలు. దేశంలో చాలా కుటుంబాలు నెలకు పదివేల రూపాయలతో బతికే పరిస్థితి ఉంది. అయినా నెలమొత్తం సంపాదన సినిమా చూడ్డానికి ఖర్చుపెట్టడానికి వెనకాడని అభిమానులను ఏమనాలి?

వ్యక్తిపూజ అనేది మనిషికి అవమానకరమైనది. సమాజానికి హానికరమైనది. ✤

అబ్దుల్ వాహెద్

# మాయమాటలు

**దేశ ఆర్థిక శక్తి,** రాజకీయ బలం, సామాజిక పరిస్థితులు ఎలా ఉన్నాయో తెలుసుకునే కొలబద్దలేమిటి? నెహ్రూ కాలం నుంచి మోడీ కాలం వరకు ప్రతి ప్రభుత్వ హయాంలోను ఈ ప్రశ్న తప్పక ముందుకు వస్తోంది. ప్రతి ప్రధాని తాను చాలా గొప్పగా పనిచేశానని చెప్పుకోవడంలో ఆశ్చర్యమూ లేదు. తన హయాంలో దేశం ఆర్థికశక్తిగా మారిందని, ప్రపంచ రాజకీయ చిత్రపటంలో దేశప్రతిష్ఠ పెరిగిందని, సామాజికంగా దేశంలో అద్భుతమైన పరిస్థితులు సృష్టించానని అధికారంలో ఉన్న ప్రతి పార్టీ చెప్పుకుంటుంది. కాని ప్రధాని మోడీ ఒక అడుగు ముందుకేసి బీజేపీ మాదిరిగా గొప్పగా పని చేసిన వారెవ్వరూ లేరని చెప్పేశారు. అంతేకాదు, ఇతర పార్టీల ప్రభుత్వాలు చేసిందేమిటో, తాము చేసిందేమిటో పోల్చి చూసుకోవాలని సవాలు కూడా విసిరేశారు.

బీజేపీ అధికారంలోకి వచ్చినప్పుడు చేసినంత పని, ఇతర పార్టీలు అధికారంలో ఉన్నప్పుడు చేయలేదని అన్నారు. స్వయంగా పరిశీలించి తెలుసుకోవచ్చని చెప్పారు. ఒక కాగితంపై నిలువుగా ఒక గీత గీసి, ఒకవైపు ఇతర పార్టీల పనితీరు, ఒకవైపు బీజేపీ పనితీరు రాసి చూసుకోవచ్చని అన్నారు.

ఇది నిజంగా మంచి పద్ధతి. ఇలా చేస్తే ఎవరేం చేశారో తెలిసిపోతుంది. ప్రధాని మోడీ ప్రధాని కాక ముందు తరచు భారత రూపాయి అంటే దేశగౌరవానికి సంబంధించిన విషయంగా చెప్పేవారు. అందువల్ల రూపాయి విలువ ఎన్నడూ పడిపోరాదని చెప్పేవారు. ఆయన ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు, ప్రధానిగా పదవి స్వీకరించిన కొత్తలో కూడా రైతులను అన్నదాతలన్నారు. వారి ఆదాయం పెంచేస్తానన్నారు. ఆయన ప్రధాని కాక ముందు దేశంలో నైపుణ్యాలు పుష్కలంగా ఉన్నాయని, నిరుద్యోగ సమస్యను చాలా సులభంగా సమర్థవంతంగా పరిష్కరించవచ్చునని చెప్పేవారు. ఇలాంటి మాటలు చాలా ఉన్నాయి.

ప్రధాని మోడీ చెప్పినట్లు ఇతర ప్రభుత్వాలు, బీజేపీ ప్రభుత్వం మధ్య పనితీరును పోల్చి చూసుకోవడం వల్ల చాలా విషయాలే తెలుస్తాయి. కాని ఎక్కడి నుంచి ప్రారంభించాలి. దేశం నెత్తిన ఉన్న రుణభారం నుంచి మొదలు పెట్టాలా లేక పడిపోతున్న రూపాయి విలువతో మొదలు పెట్టాలా? రైతుల ఆదాయ

పరిస్థితి, మన్రేగా లేదా శ్రామికులకు లభించే కనిష్ట కూలి, నిరుద్యోగ పరిస్థితి, దేశంలో పెరిగిన కార్పొరేట్ ప్రాబల్యం, దేశ ఆర్థిక వ్యవస్థ ఇలా అనేకం ఉన్నాయి. ఎక్కడి నుంచి మొదలుపెట్టాలి?

ఎవరేం చేశారు? ఈ ప్రభుత్వం ఎంత పని చేసింది? ఈ సమాచారం కాస్త కష్టపడితే తప్పక దొరుకుతుంది. భారతదేశం తలపై ప్రపంచబ్యాంకు, ఐఎంఎఫ్ అప్పులు ఎప్పుడు ఉన్నాయి. గత ప్రభుత్వాల కాలంలో ఉన్న అప్పుల కన్నా ఇప్పుడు రెట్టింపు కాదు అంతకు మించి పెరిగిపోయాయి. అంటే ఇంతకు ముందు ఏ ప్రభుత్వాలున్నాయో అవి ప్రపంచబ్యాంకు, ఐఎంఎఫ్ నుంచి అప్పు తీసుకునేవారు. అందువల్ల ఈ అంతర్జాతీయ సంస్థల షరతులను కూడా పాటించి, అందుకు తగిన చర్యలు కూడా తీసుకోవలసి వచ్చేది. ఇప్పుడు కూడా గత ఆరేడు సంవత్సరాలుగా జియస్టీ, ఆర్థిక నిర్ణయాల వెనుక ఐఎంఎఫ్, ప్రపంచ బ్యాంకుల ఒత్తిడి లేదా? విదేశీ అప్పులు తీసుకోవడం ఇలాగే కొనసాగితే మొత్తం దేశ ఆర్థికవ్యవస్థ, బడ్జెటు, స్థూలాదాయం అంతా అప్పుల పరిధిలోకే వెళ్ళిపోతుంది. ప్రపంచబ్యాంకు దీన్ని రెడ్ అలర్ట్ అంటుంది. గతంలో ఏ ప్రభుత్వ కాలంలో కూడా రెడ్ అలర్ట్ పరిస్థితి రాలేదు. ఒకప్పుడు దేశంలోని బంగారాన్ని తాకట్టు పెట్టవలసిన పరిస్థితి అయితే వచ్చింది. కాని ఇప్పుడు ప్రశ్న బంగారం గురించి కాదు, ప్రశ్న డాలర్ గురించింది. డాలర్ విలువ 64 రూపాయలున్నప్పుడు మోడీ గుజరాత్ ముఖ్యమంత్రిగా చాలా విమర్శలు గుప్పించారు. రూపాయి అనేది దేశప్రతిష్ఠకు సంబంధించిందని చెప్పారు. ఇప్పుడు డాలర్ విలువ 84 రూపాయలు దాటి సెంచరి కొట్టడానికి సిద్ధంగా ఉంది. ఇది పరిస్థితి.

అమెరికన్ డాలర్ అంతర్జాతీయ కరెన్సీగా చాలా బలపడుతోంది కాబట్టి రూపాయి విలువ పడిపోతుందని, ప్రపంచంలో వివిధ ప్రాంతాల్లో యుద్ధాలు జరుగుతున్నాయి కాబట్టి రూపాయి విలువ పడిపోయిందని అంటున్నారు. ఏది ఏమైనా రూపాయి విలువ ఇంతగా పడిపోవడానికి కారణమేమిటనే విశ్లేషణలు ఇప్పుడు పెద్దగా మీడియాలో కనిపించడం లేదు.

ప్రస్తుతం భారతదేశంలో విదేశీ పెట్టుబడులు 658 బిలియన్ డాలర్లని తెలుస్తోంది. దేశానికి ఉన్న విదేశీ అప్పులు 668 బిలియన్ డాలర్లు. చైనా నుంచి దిగుమతులు రికార్డు స్థాయికి పెరిగాయి. స్వదేశీ మాటలు వింటూ వస్తున్నాం, చైనాకు కళ్ళెర్రజేసాం, కానీ చైనా నుంచి దిగుమతులు పెరిగిపోయాయి.

ఇప్పుడు దేశంలో పరిస్థితి ఏమిటంటే, అంబానీ కుటుంబంలో పెళ్ళి జరిగినా కొంతమంది ఉపాధి దొరికిందని సంతోషపడే పరిస్థితి. దేశంలో ఎన్నికలప్పుడు భారీ మొత్తంలో బ్లాక్ మనీ బయటపడుతుంది. అలాగే ఎన్నికలప్పుడు కూడా చాలా మందికి ఉపాధి దొరుకుతుంది. దేశంలో రైతులు సమస్యలెదుర్కొంటున్నారు. వారి ఆదాయం రెట్టింపు ఎప్పుడవుతుందో తెలియదు, గిట్టుబాటు ధర విషయంలో వారి డిమాండ్లు ప్రభుత్వం ఎప్పుడు వింటుందో తెలియదు. దేశంలో చిన్న, మధ్యస్థాయి పరిశ్రమలు మూతపడుతున్నాయి.

రైతుల ఆదాయం 2022కే రెట్టింపు కావలసింది. నేడు దేశంలో రైతులు ఆందోళనలకు దిగే పరిస్థితి ఉంది. దేశంలో మొత్తం రైతులపై ఉన్న రుణం పాతికలక్షల కోట్ల రూపాయలకు మించి ఉంది. 2019లో ఎన్నికలు ముగిసి, ప్రధాని మోడీ రైతుల ఆదాయం రెట్టింపు చేస్తానన్నప్పుడు రైతులపై ఉన్న రుణం 13 లక్షల కోట్ల రూపాయల వరకు ఉంది. అంటే ఇప్పుడు రెట్టింపయ్యింది. ఈ రుణాల్లో చాలా ఎక్కువ రుణాలు పంటల కొరకు తీసుకున్నవే. పంట బీమా ఉన్న దేశంలో రైతులు పంటల కొరకు రుణాలు తీసుకోక తప్పని పరిస్థితి. దేశంలో 66 శాతం మంది రైతులు అప్పుల్లో మునిగిపోయి ఉన్నారు. సగటున ప్రతి రైతుపై 70వేలకు పైబడి అప్పు ఉన్నట్లు తెలుస్తోంది. రైతుల పరిస్థితితో పాటు, రైతు కూలీలు, గ్రామీణ కూలీలు, మన్రేగా శ్రామికులు వీళ్ళందరి పరిస్థితి ఎలా ఉందో పరిశీలించాలి. కాని అసంఘటిత రంగంలో పరిస్థితి ఎలా ఉందో తెలుసుకునే డాటా అందుబాటులో లేదు.

దేశంలో ఐదు కిలోల బియ్యం, కొందరికి నివాసగృహాలు, కిసాన్ సమ్మాన్ నిధి నుంచి ఉపలబ్ధి ఈ మూడింటిని తొలగిస్తే, దారిద్ర్య రేఖకు పైన ఉన్నట్లు ఇప్పుడు కనిపిస్తున్న వారిలో చాలా చాలా మంది దారిద్ర్యరేఖ కిందకు వెళ్ళిపోతారు.

రెండుకోట్ల ఉద్యోగాల కల్పన హామీ ఏమైంది? సంఘటిత రంగంలో పనిచేస్తున్న వారి సంఖ్య దాదాపు ఆరున్నరశాతం తగ్గిపోయింది. ఇవన్నీ మనకు కనిపిస్తున్న వాస్తవాలే. దేశంలో కోటీశ్వరుల సంఖ్య పెరిగిందన్నది కూడా మరో వాస్తవం. దేశంలో కార్పొరేట్ నెట్ వర్త్ పెరిగింది. కాని ఉత్పాదకత తగ్గింది. కోర్ సెక్టర్ పరిస్థితి కూడా ఇదే. కాని ప్రధాని పాత ప్రభుత్వాల కన్నా తమ ప్రభుత్వం చాలా గొప్పగా పనిచేస్తుందన్నారు. ఇప్పుడు పొలిటికల్ ఫండింగ్ మాత్రం చాలా పెరిగిపోయింది. ✤




# క్యాన్సర్‌కు టీకా

క్యాన్సర్ ఒక భయంకరమైన వ్యాధి. క్యాన్సర్ వార్త విన్న వెంటనే రోగి సగం చచ్చిపోతాడు. ప్రాణాలపై ఆశ పోతుంది. మరోవైపు క్యాన్సర్ వైద్యం అత్యంత ఖరీదైనది. క్యాన్సర్ మందులు ఖరీదైనవి. వ్యాధి నిర్ధారణ కూడా ఖరీదైనది.

మాజీ క్రికెట్ క్రీడాకారుడు నవజ్యోత్ సింగ్ సిద్ధూ ఇటీవల తన భార్య క్యాన్సర్ వైద్యం గురించి చేసిన ప్రకటన తర్వాత కూడా చాలా మంది అభ్యంతరాలు పెట్టారు. క్యాన్సర్ చికిత్సను కొనసాగిస్తూ సపోర్టివ్ గా ఈ ఆహారనియమాలు పాటించాలని చెప్పారు.

ఈ నేపథ్యంలో రష్యా అధ్యక్షుడు పుతిన్ క్యాన్సర్ టీకా తయారు చేశామని చేసిన ప్రకటన ఎంతో ముఖ్యమైనది.

యుద్ధం చేయకుండా, ఆయుధాలు వాడకుండా, ఆంక్షలు విధించ కుండా వ్లాదిమిర్ పుతిన్ అమెరికా బిత్తరపోయేలా చేశాడని చెప్పాలి.

విషయమేమిటో అర్థం చేసుకోవాలంటే ప్రపంచంలో ఫార్మాలాబీ ఎంత బలంగా పనిచేస్తుందో కూడా అర్థం చేసుకోవాలి. కరోనా సమయంలో టీకాల విషయంలో ఏమేం జరిగిందో అందరూ చూశారు. ప్రపంచంలో అనేక మందుల విషయంలో ఫార్మా కంపెనీలు ముఖ్యంగా పాశ్చాత్య ఫార్మా కంపెనీల గుత్తాధిపత్యం నడుస్తుంటుంది. క్యాన్సర్ మందుల విషయంలో ఇదే జరుగుతుం టుంది.

పుతిన్ ఇప్పుడు క్యాన్సర్ టీకా కనిపెట్టామని ప్రకటించాడు. ప్రపంచవ్యాప్తంగా క్యాన్సర్ వైద్యం అత్యంత ఖరీదైన వైద్యంగా మారింది. నిజానికి ఈ వార్త పుతిన్ ఈ సంవత్సరం ఫిబ్రవరిలోనే ప్రకటించారు. అప్పుడాయన క్యాన్సర్ టీకా త్వరలోనే తయారు చేస్తామని చెప్పారు. ఇప్పుడాయన క్యాన్సర్ టీకా తయారైపోయిందని ప్రకటించారు. పైగా రష్యా పౌరులందరికీ ఉచితంగా ఆ టీకా వేస్తామని కూడా చెప్పారు. కాని ఈ సూది మందు నొప్పి అమెరికా గిలగిలలాడేలా చేస్తోంది. ఎందుకంటే, ప్రపంచవ్యాప్తంగా క్యాన్సర్ వ్యాధి వైద్యం అనేది పెద్ద బిజినెస్ గా మారింది. ఫార్మా కంపెనీలు, ఆసుపత్రులు అన్నీ ఇందులో ఉన్నాయి. ఇప్పుడు క్యాన్సర్ టీకా వస్తే ఈ మొత్తం వ్యాపారాలు కుప్పకూలిపోతాయి. పది, పదిహేను, పాతిక లక్షల రూపాయల వైద్యం చేసే పెద్ద పెద్ద ఆసుపత్రులు మూతపడతాయి. అమెరికాలో క్యాన్సర్ మందుల మార్కెట్ యాభై బిలియన్ డాలర్ల మార్కెట్. ఇది 2034 నాటికి 120 బిలియన్ డాలర్లకు చేరుకుంటుందని అంచనా. క్యాన్సర్ రోగనిర్ధారణకు జరిగే పరీక్షల మార్కెట్టు 25 బిలియన్ డాలర్ల మార్కెట్టు. క్యాన్సర్ టీకా వస్తే ఈ వ్యాపారాలన్నీ మూతపడతాయి. ముఖ్యంగా అమెరికాకు జరిగే నష్టం ఇది. రష్యా వైద్యరంగం ద్వారా అమెరికాపై వేసిన వేటు ఇది. ఎందుకంటే అమెరికా ప్రభుత్వంపై ఫార్మా లాబీ ప్రభావం బలంగా ఉంది. కోవిడ్ కాలంలో అమెరికా అధ్యక్షుడు ఎలా ఫార్మా కంపెనీల ప్రతి డిమాండ్ ఒప్పుకున్నారో మనం చూశాం.

ఈ నేపథ్యంలో పుతిన్‌కు సన్నిహితుడైన ఒక సైంటిస్టు హత్య జరిగింది. ఈ హత్య చేయించింది ఉక్రెయిన్ అని అంటున్నారు, కాని స్కూటరు విస్ఫోటం ద్వారా చేయించిన ఈ హత్య జరిగిన తీరు ఇస్రాయిల్ హస్తం ఉన్నట్లు అనుమానాలు కొందరు ప్రకటిం చారు. త్వరలోనే ఈ హత్య వెనుక ఎవరున్నారన్నది కూడా బయట పడుతుంది.

ఏది ఏమైనా క్యాన్సర్ పేరుతో ఫార్మా కంపెనీలు భారీ లాభాలు ఆర్జిస్తున్నాయన్నది వాస్తవం. ఇన్ని లాభాలున్నప్పుడు టీకా ద్వారా క్యాన్సర్ ను పూర్తిగా పారదోలే పని ఎవరు చేస్తారు. ఇప్పుడు రష్యా చేసిన పని ఒకప్పుడు సోవియట్ కూడా చేసేది. రష్యా తయారు చేసిన ఈ టీకా గురించి వివరాలు బయటకు రాలేదు. కాని క్యాన్సర్‌కు యాంటీ బాడీ కనిపెట్టడం జరిగి ఉంటే మాత్రం అమెరికాకు పెద్ద దెబ్బ తీసినట్లే.

పుతిన్ ఈ వార్త బయటపెట్టిన టైమింగ్ కూడా గమనార్హం. ప్రపంచంలో కొత్త మహమ్మారి వస్తుందనే ఆందోళనల వార్తలు ఇటీవల వినిపిస్తున్నాయి. ఎలాంటి మహమ్మారి అంటే కరోనా మాదిరిగా జంతువుల నుంచి మనుషులకు వ్యాపించే జబ్బు. ఇప్పుడు కొత్తగా బర్డ్ ఫ్లూ గురించి ఆందోళనలు వినిపిస్తున్నాయి. దీనికి టీకా తయారు చేస్తామనే ప్రకటనలు వస్తున్నాయి.

బర్డ్ ఫ్లూ మనుష్యులకు సంక్రమిస్తోందన్న వార్తలు వస్తున్నాయి. ఈ మహమ్మారికి టీకాలు తయారు చేసే ప్రయత్నాలు జరుగు తున్నాయి.

ఈ వ్యాక్సిన్లు తయారు చేసేది ఫార్మా లాబీయే. దీనిలో కూడా లాభాలుంటాయి. కాని ఇవన్నీ ఒకవైపు జరుగుతుంటే మరోవైపు పుతిన్ క్యాన్సర్ కు టీకా తయారు చేశామని ప్రకటించి, ఫార్మాలాబీ ఆశలపై చన్నీళ్ళు కుమ్మరించాడు. ఏది ఏమైనా క్యాన్సర్ టీకా ముందుకు వస్తే చాలా మందికి చాలా ప్రయోజనం కలుగుతుంది.

# ఉద్యమానికి ఊపిరి

## దైవిక యోచన, దైవారాధన పట్ల మక్కువ

ఉర్దూ మూలం : ముహియుద్దీన్ గాజీ
తెలుగు రూపం : ముహమ్మద్ అజీజుర్రహ్మాన్

**దైవదాసులను దేవుని వైపునకు పిలువాలన్న ఆలోచనైతే ఆంతర్యంలో ఉరకలు వేస్తోంది. కాని దైవాన్ని సేవించాలన్న ఆలోచన మాత్రం చచ్చుపడిపోయింది. ఒకవేళ పరిస్థితి ఇలాగే వుంటే, దాని గురించి అంతర్మథనం చెందాలి. ఆత్మ విమర్శన చేసుకోవాలి.**

దేవుని పట్ల గల ప్రేమ మనిషిని అతని విశ్రాంతి స్థలం నుండి వెలికి తీసి కార్యక్షేత్రానికి రప్పిస్తుంది. అక్కడ అతను దైవధర్మాన్ని స్థాపించడానికి నిరంతరం కృషి చేస్తాడు. దైవం పట్ల గల ప్రేమే మనిషిని అతని ప్రశాంత నిలయం నుండి లేపి, ఆరాధనాలయంలోనికి తీసుకువస్తుంది. అక్కడ అతను ఆరాధనలో నిలబడతాడు. దైవ సన్నిధిలో సాష్టాంగ పడతాడు. ఇస్లామీయ ఉద్యమం ప్రేమకు సంబంధించిన ఈ రెండు వ్యక్తీకరణల సమాహారం అనాలి. ఇస్లామీయ ఉద్యమానికి సంబంధించిన ప్రతి కార్యకర్త వ్యక్తిత్వం ఈ రెండు సుగుణాలతో శోభిల్లుతూ ఉంటుందని ఆశించాలి.

### దివ్య ఖుర్ఆన్ సుందర స్వరూపాలు

దివ్య ఖుర్ఆన్‌లో ఎక్కడ విశ్వాసుల సుగుణాలు ప్రస్తావనకు వచ్చినా, వాటిలో ఈ రెండు పార్శ్వాలు ప్రస్ఫుటంగా గోచరిస్తాయి. ఉదాహరణకు ఇక్కడ మేము కొన్ని రూపురేఖలను సమర్పిస్తున్నాము-

**"కరుణామయుని (అసలు) దాసులు ఎవరంటే, వారు నేలపై అణకువతో నడుస్తారు. మూర్ఖులు వారిని పలుకరించినప్పుడు, మీకో సలామ్ అని అంటారు, తమ ప్రభువు సన్నిధిలో సాష్టాంగపడి (సజ్‌దాలోను) నిలబడి రాత్రులు గడుపుతారు."**
**(అల్ ఫుర్ఖాన్ : 63,64)**

పై రెండు ఆయత్‌లలో మొదటి ఆయత్ కరుణామయుని సిసలైన దాసుల ఉద్యమ కృషిని ప్రతిబింబిస్తోంది. వారు తపోనిష్ఠాపరాయణుల ఏకాంత కుహరాలకో, సన్యాసుల ఆశ్రమాలకో పరిమితమై ఉండరు. పైగా వారు జనసంచారం మధ్యన నడయాడుతూ ఉంటారు. వారి నడకలో అణకువ, హుందాతనం ఉట్టి పడుతూ ఉంటుంది. వారు మౌనవ్రతం పాటించరు. పైగా ప్రజా బాహుళ్యం మధ్యన సంభాషణలు జరుపుతారు. సమాలోచనలు సాగిస్తారు. కాని అజ్ఞానులతో, మూర్ఖులతో వాదనకు దిగరు. ఒకవేళ మూర్ఖులు వారిని రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తే, చాకచక్యంగా వారి ఉచ్చులో నుండి బయటపడతారు.

రెండవ ఆయత్ కరుణామయుని దాసుల ఆరాధనలకు సంబంధించిన రమణీయమైన దృశ్యాన్ని చిత్రీకరిస్తోంది. అది విశ్వాసాన్ని (ఈమాన్‌ను) వృద్ధి చేస్తుంది. వారి రాత్రులు దైవారాధనలో నిలబడటంలో, సాష్టాంగ ప్రణామాలలో, వేడుకోళ్లలో గడుస్తాయి.

అల్ ముజ్జమ్మిల్ సూరాలోని ఆరంభ వచనాలలో కూడా ఈ కోణాలు ప్రస్ఫుటం చేయబడ్డాయి-

**"ఓ దుప్పటి కప్పుకుని పడుకునేవాడా! రాత్రివేళ నమాజులో నిలబడుతూ ఉండు, కాని కొంచెంసేపు మాత్రమే; రాత్రిలో సగభాగం లేదా దానిని కొంచెం తగ్గించుకో లేదా దానిని కొంచెం పొడిగించుకో. ఖుర్‌ఆన్‌ను నెమ్మదిగా ఆగి ఆగి పఠించు. మేము నీపై ఒక గంభీరమైన వాణిని అవతరింప జేయబోతున్నాము. వాస్తవానికి రాత్రివేళ లేవటం మనస్సును అదుపులో ఉంచేందుకు ఎంతో ఉపయుక్తమైనది; ఖుర్‌ఆన్‌ను శ్రద్ధగా పఠించేందుకు ఎంతో అనువైనది; ఎందుకంటే, పగటివేళ నీకు చాలా పనులుంటాయి."** ***(అల్ ముజ్జమ్మిల్ : 1-7)***

సందేశ పరిచయ కార్యం నిర్వర్తించాలన్న ఆలోచన అంతరాళంలో ఉవ్విళ్ళూరే వ్యక్తి పగటివేళ ఎంతోమందిని కలుసుకుని సత్యసందేశాన్ని వారికి చేరవేస్తాడు. పగలంతా ఉండే ఈ కార్యనిమగ్నత ఆధ్యాత్మిక టానిక్కును వాంఛిస్తుంది. అయితే పగటివేళ అతనికి తీరిక చిక్కదు. ఏకాగ్రత కూడా ప్రాప్తించదు. రాత్రివేళ అతనికి తీరిక లభిస్తుంది. ప్రజలు ఆదమరచి నిద్రిస్తూ ఉంటారు. అదీగాక రాత్రివేళ చేసే ఆరాధన దైవ సామీప్యానికి ఎంతో అనువైనది. ఆ సమయంలో చేసే సాష్టాంగ ప్రణామాలలో, గ్రంథ పారాయణంలో, వేడుకోళ్ళలో భక్తి పరవశించి పారుతుంది. ఆ మాటకొస్తే దాసుడు ఎల్లవేళలా కార్యనిమగ్నుడై ఉంటాడు. పగటివేళ సందేశ పరిచయ కార్యంలో, సంస్కరణా ప్రయత్నంలో నిమగ్నుడై ఉంటే, రాత్రివేళ ప్రార్థనల్లో, వేడుకోళ్లలో, దైవనామ స్మరణలో లీనమై ఉంటాడు.

అల్ ముద్దస్సిర్ సూరాలోని తొలి ఆయత్‌లలో కూడా ఈ రెండు కార్యకలాపాలు ఒకేసారి వివరించబడ్డాయి-

**"లే, లేచి భయబోధ చెయ్యి. నీ ప్రభువు ఘనతను చాటి చెప్పు."** ***(అల్ ముద్దస్సిర్ : 2,3)***

భయ బోధ చేయటం సందేశ కార్యంలో అంతర్భాగమైతే, ప్రభువు గొప్పతనాన్ని చాటడం ఆరాధనకు ప్రతీక.

హకీమ్ లుఖ్మాన్ తన కుమారునికి హితబోధ చేసినప్పుడు ఒకే వాక్యంలో ఈ రెండు కోణాలను సమీకరించారు:

**"కుమారా! నమాజును స్థాపించు. మంచిని (చెయ్యమని) ఆజ్ఞాపించు, చెడు పనుల నుండి నిరోధించు. ఏ కష్టం కలిగినా దానిపై సహనం వహించు. ఈ విషయాలు ఎంతో గట్టిగా ఆజ్ఞాపించబడిన విషయాలు."** ***(లుఖ్మాన్ -17)***

చూశారా! ఒక వైపున నమాజుల వ్యవస్థకు కట్టుబడి ఉండు అన్న ఆదేశం. మరో వైపున సదాచారాల వ్యాప్తి, చెడుల నిరోధనకు సంబంధించిన ఆజ్ఞ! ఈ మార్గంలో ఎదురయ్యే కష్టనష్టాలపై ఓపిక పట్టమన్న ఉపదేశం!

ఇస్లామీయ ఉద్యమంతో సంబంధమున్న వ్యక్తుల్ని ఈ తరహాలోనే తర్ఫీదు ఇవ్వాలి.

అలాగే ఈ క్రింది దివ్య వచనాలను పఠిస్తూ ఉండాలి. ఇవి ఉద్యమంలో దైనందిన కార్యకలాపాల, ఆరాధనల అతి సుందరమైన మేళవింపుతో కూడిన భావనను కలిగిస్తాయి.

**"వారు నీకు ఈ భూభాగంలో నిలువ నీడ లేకుండా చెయ్యటానికి నిన్ను ఇక్కడ నుండి వెళ్ళగొట్టటానికీ పూనుకున్నారు. కాని ఒకవేళ వారు అలా చేస్తే నీ తరువాత వారు కూడా ఇక్కడ ఎంతో కాలం నిలువలేరు. ఇది మా సనాతన సంప్రదాయం. దీనినే నీకు పూర్వం మేము పంపిన ప్రవక్తలందరి విషయంలోనూ అనుసరించాము. మా సంప్రదాయంలో నీవు ఏ మార్పునూ చూడలేవు. నమాజును స్థాపించు. పొద్దు వాలినప్పటి నుండి రాత్రి చీకటిపడే వరకు, ప్రాతఃకాలంలో ఖుర్‌ఆన్ పారాయణం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించు. ఎందుకంటే ప్రాతఃకాలపు ఖుర్‌ఆన్ పారాయణం సాక్ష్యంగా ఉంటుంది. రాత్రిపూట "తహజ్జుద్" నమాజు చెయ్యి. ఇది నీకు అదనపు నమాజు. నీ ప్రభువు నిన్ను ప్రశంసనీయమైన ఉన్నత స్థానంలో ప్రతిష్ఠింపజేయటం అసంభవం ఏమీ కాదు. ఇలా ప్రార్థించు : 'ప్రభూ! నీవు నన్ను ఎక్కడకు తీసుకొని వెళ్ళినా సత్యంతో తీసుకొని వెళ్ళు. ఎక్కడ నుండి తీసినా సత్యంతో తియ్యి. నీ తరపు నుండి ఒక అధికారాన్ని నాకు సహాయంగా పంపించు'. ఇలా ప్రకటించు: "సత్యం వచ్చేసింది. అసత్యం నశించింది. అసత్యం నశించక తప్పదు."** ***(అల్ ఇస్రా : 76-81)***

ఈ దివ్య వచనాలలో సందేశ పరిచయ కార్యానికి- ధర్మ సంస్థాపనా కృషికి సంబంధించిన అత్యంత సుందరమైన రూపం ఉంది. వ్యతిరేకులు ఈ కృషిని ఫలవంతం కాకుండా చేయడానికి అన్ని రకాల ఎత్తులు వేస్తున్నారు. ఆఖరికి వారు సత్యసందేశాన్ని అందజేసే వానిని తమ దేశం నుండి వెళ్ళగొట్టేందుకు కూడా సిద్ధమవుతున్నారు. అదే సమయంలో సత్యధర్మాన్ని పరిచయం చేసేవాడు ఎంతో సహనంతో, స్థయిర్యంతో తన కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నాడు. అదే సమయంలో రెండవ రమణీయమైన రంగు ఆరాధనలది. సూర్యుడు నడినెత్తి మీది నుండి వాలినప్పటి నుండి రాత్రి చీకటి అలుముకునే వరకు నమాజులు చేస్తూ ఉండటం, మరి ప్రభాత సమయం (ఫజ్ర్)లో సుదీర్ఘ పారాయణంతో కూడిన నమాజ్ చేయటం, ఆ తరువాత రాత్రి పూట తహజ్జుద్ నమాజు చేయటం, ఈ నమాజులతో పాటు వేడుకోళ్ళ ద్వారా దైవ సహాయం కొరకు దీనాతిదీనంగా అర్థించటం- దైవ చింతనతో కూడిన ఈ రెండు రంగుల అతి సుందరమైన మేళవింపు పరాకాష్ఠకు చేరినప్పుడు సత్యం ప్రాబల్యం వహించే, అసత్యం ఓటమి పాలయ్యే శుభ ఘడియ వచ్చేస్తుంది.

## దైవ మార్గంలో నిరంతర సాధన, ఆరాధనలతో కూడిన ఒక అందమైన వేడుకోలు

"నా ప్రభూ! నాకు తోడ్పాటునందించు. నాకు వ్యతిరేకంగా ఎవరికీ తోడ్పడకు. నాకు సహాయపడు. నాకు వ్యతిరేకంగా ఎవరికీ సహాయపడకు. నాకు విజయం వొసగు. నాకు వ్యతిరేకంగా విజయ నిర్ణయం గైకొనకు. నా కొరకు ఉపాయం చెయ్యి. నాకు వ్యతిరేకంగా ఉపాయం చెయ్యకు. నాకు మార్గదర్శనం చెయ్యి. మార్గదర్శనంపై అమలుపరచటం నాకు సులభతరం చెయ్యి. నాపై దౌర్జన్యానికి పూనుకున్న వారికి వ్యతిరేకంగా నాకు సహాయపడు.

"నా ప్రభూ! నీ యెడల కృతజ్ఞత కలిగి ఉండేలా నన్ను తీర్చి దిద్దు. నీ ధ్యానాన్ని నాకు ప్రియతమం చెయ్యి. నా హృదయం నీ పట్ల భీతితో నిండిపోయేలా చెయ్యి. నీ విధేయతను నా అభిలాషగా మలచు. నన్ను నీ వైపునకు మొగ్గేలా చెయ్యి. నీ పట్ల ప్రేమతో నా హృదయం కళకళలాడేలా చెయ్యి- నేను నీ యందు మనసును లగ్నం చేసేవాణ్ణి కావాలి. (ప్రభూ!) నా పశ్చాత్తాపాన్ని ఆమోదించు. నా మొరను ఆలకించు. నా అంత రంగానికి మార్గదర్శకత్వం వహించు. నేను చూపే ఆధారాలు, నిదర్శనాలకు పటిష్ఠతను ప్రసాదించు. నా నోటి మాట తిన్నగా (సూటిగా, సవ్యంగా) ఉండేలా చెయ్యి. నా హృదయ వక్రతను దూరం చెయ్యి." *(ముస్తద్రక్ హాకిమ్)*

ఈ వేడుకోలు (దుఆ) వాక్యాలను గురించి కాస్త ఆలోచించండి! దీని మొదటి భాగంలో సత్యాసత్యాల సంఘర్షణకు సంబంధిం చిన అభ్యర్థన ఉంది. రెండవ భాగంలో ఆరాధనల పట్ల గల అమితాసక్తి తొణికిసలాడుతోంది.

ఇస్లామీయ ఉద్యమ కార్యకర్తలు ఏదయినా ప్రత్యేక కార్యక్రమానికి బయలుదేరినప్పుడు ఈ దుఆలోని మొదటి భాగాన్ని పునశ్చరణ చేసుకుంటూ వెళితే ఎంత బాగుంటుంది! దేవుని తోడ్పాటు, దైవ సహాయం, దేవుని తరుణోపాయం, దైవ మార్గదర్శకత్వం లేనంత వరకు ఏ ఘనకార్యం కూడా సాధించ లేమన్న యథార్థాన్ని మరువరాదు సుమా!

ఘన కార్యం సాధించి తిరిగి వస్తున్నప్పుడు అంతరాళం ఆనందాతిశయంతో ఉవ్విళ్లూరుతుండగా ఈ దుఆలోని రెండవ భాగాన్ని నెమరు వేసుకుని తమ వినయాన్ని, అణకువను వ్యక్తపరచాలి. తమ కృతజ్ఞతా భావాన్ని చాటి చెప్పాలి.

## ఇబ్నె అసాకిర్- ఆదర్శప్రాయమైన వ్యక్తిత్వం

అది హిజ్రీ 6వ శతాబ్ది-

శిలువ సైన్యాలు ముస్లిం జగతిని నిర్దాక్షిణ్యంగా తొక్కేస్తున్న కాలం! ముస్లింలలో నలువైపులా భయోత్పాతం, నిరాశా నిస్పృ హలు, అంధకారం అలుముకుని ఉంది. సరిగ్గా ఆ సమయం లోనే ఇస్లామీయ చరిత్ర వినీలాకాశంలో కొన్ని ఉజ్వల తారలు ధగధగా మెరవసాగాయి. వాటిలో ఒక దేదీప్యమానమైన తార ఇమామ్ ఇబ్నె అసాకిర్ (రహ్మ). శిలువ శక్తులకు (క్రూసేడులకు) వ్యతిరేకంగా నూరుద్దీన్ జంగీకి ధైర్యసాహసాలు నూరిపోసి, ముస్లిం సముదాయాన్ని భయాందోళనలు, నిరాశా నిస్పృహల వాతావరణం నుండి వెలికితీసి వారిని రాజీలేని పోరాటానికి సమా యత్తం చేయటంలో కీలకపాత్ర పోషించిన వ్యక్తి ఇబ్నె అసాకిర్ అని చరిత్రకారులు వ్రాశారు.

ఇబ్నె అసాకిర్(రజి) వ్యక్తిత్వం ఇస్లామీయ ఉద్యమ కార్యకర్తలకు అత్యుత్తమ ఉదాహరణ. ఇమామ్ జహబీ గారు ఇబ్నె అసాకిర్ (రహ్మ) గురించి అబుల్ మవాహిబ్ (రహ్మ) ఇచ్చిన సాక్ష్యాన్ని ఇలా పొందుపరిచారు-

**"నా చూపులు అలాంటి వ్యక్తిని చూడలేదు. ఆయనలో ఉన్నన్ని సుగుణాలు, విశిష్టతలు ఏకత్రమై ఉన్న మరో వ్యక్తిని నేను చూసి ఎరుగను. నలభై ఏండ్ల వరకు ఐదుపూటల నమాజులలో మొదటి పంక్తిలో ఉండేలా జాగ్రత్త వహించారు. ఏదయినా షరీఅత్‌పరమైన కారణముంటే తప్ప ఆయన సామూహిక నమాజ్‌కు రాకుండా ఉండలేదు. రమజాన్ చివరి దశకంలోనూ, జిల్‌హజ్జా నెల మొదటి దశకంలోనూ 'ఏతెకాఫ్' పాటించేవారు. ఆస్తులు సంపాదించటం పట్ల, మేడలు మిద్దెలు నిర్మించటం పట్ల ఏమాత్రం ఆసక్తి ఉండేది కాదు. తన హృదయం నుండి ఈ ప్రాపంచిక వ్యామోహాలన్నింటినీ తీసి పారేశారు. నాయకత్వం వహించే, ఖతీబ్‌గా ఉండే పదవులకు దూరంగా ఉండేవారు. అధికారుల దర్బారులకు వెళ్ళేవారు కారు. సదాచారాలను వ్యాపింపజేసే, చెడులను రూపుమాపే మహత్కార్యంలో తనను నిమగ్నం చేసుకున్నారు. దైవ మార్గంలో ఇతరుల నిందలు నిష్ఠూరాలను లక్ష్యపెట్టేవారు కారు." (సియర్ ఏలాముస్నబ్‌లా)**

## సమగ్రత, సమతుల్యత కల వ్యక్తిత్వం

ఇస్లామీయ వ్యక్తిత్వానికి శోభాయమానమైన గుణం ఏమిటంటే, అందులో సమగ్రత ఉండాలి, సమతౌల్యం ఉండాలి. ధర్మావ గాహన విషయంలో నిశిత దృష్టి ఉండాలి. ఐహిక అనాసక్తత, ఆరాధనల విషయంలో ఆ వ్యక్తిత్వం ఆదర్శప్రాయమై ఉండాలి. సందేశ ప్రదానంలో, సంస్కరణలో ముమ్ముందు ఉండాలి. ఇస్లా మీయ ఉద్యమానికి ఇలాంటి వ్యక్తులు కావాలి. వారు విద్యా విజ్ఞానాల్లో అభివృద్ధి చెందాలి. మంచీ చెడుల సంఘర్షణలో సతతం ముందంజ వేయాలి. ఆరాధనల్లో నిమగ్నులై ఉండాలి.

ఇస్లామ్ చరిత్రలో ఇలాంటి గొప్ప వ్యక్తిత్వాల ప్రస్తావన మనకు ప్రతి కాలంలోనూ వస్తుంది. చరిత్రకారులు ఇలాంటి మహ నీయుల గురించి ప్రత్యేకంగా ప్రస్తావిస్తుంటారు. ఇక్కడ మేము

దృష్టాంతానికి కొందరు వ్యక్తులను మాత్రమే ప్రస్తుతిస్తున్నాము.

- ఇబ్రాహీం బిన్ మైమూన్ మర్వజీ (రహ్మ) : ఈయన ఎన్నదగ్గ విద్వాంసులు, సందేశ ప్రదాత, దైవదాసుడు. జ్ఞానార్జనలో ముందంజ వేశారు. హదీసులో నమ్మకస్తులు. ఫికహ్‌లో ప్రావీణ్యం కలవారు. సంస్కరణా కార్యం పట్ల ప్రత్యేకంగా శ్రద్ధ వహించారు. మంచిని పెంపొందించే కార్యానికి పెట్టింది పేరు. ఆరాధనల పట్ల అమిత శ్రద్ధాసక్తి కలవారు. వృత్తిరీత్యా ఆయన స్వర్ణకారుడు. ఒకవేళ బంగారంపై సుత్తి దెబ్బ కొట్టడానికి సుత్తి ఎత్తిన క్షణంలో అజాన్ (పిలుపు) గనక వినవస్తే ఆ సుత్తి అలాగే ఆగిపోయేది. (సరాసరి ఆరాధనాలయం వైపునకు బయలుదేరేవారు) *(తహ్‌జీబుత్తహ్‌జీబ్)*
- హుజర్ బిన్ అదీ గురించి ఇమామ్ జహ్‌బీ ఇలా వ్రాశారు: ఆయన ఎల్లరికీ ప్రియతములు. ప్రజా నాయకుడు. ఆయన మాటకు సమాజంలో విలువ ఉండేది. మంచి పనులను పెంపొందించటంలో సదా మున్ముందు ఉండేవారు. చెడులను ఎత్తి చూపటంలో కూడా వెనక్కి తగ్గేవారు కారు. దైవ దాస్యంలో, భక్తితో కూడిన కార్యాలలో సాటిలేని మేటి. *(సియర్ ఏలా మున్నబ్‌లా)*
- సులమ్ బిన్ సాలిమ్ బల్ఖీ గురించి చరిత్రకారులు ఇలా వ్రాశారు: "ఐహిక అనాసక్తత, సాధు స్వభావం, దైవదాస్యం ఆయన విశేష ఆభరణాలు. ఆయన తన కాలపు ఉమర్ బిన్ అబ్దుల్ అజీజ్. మంచిని చెయ్యమని ఆదేశించడంలో మున్ముందు ఉండేవారు. ఈ 'నేరానికే' ఖైదు చేయబడ్డారు." *(సియర్ ఏలామున్నబ్‌లా)*
- ధర్మవేత్తగా, హదీసువేత్తగా సుప్రసిద్ధులైన ఇబ్నె బత్‌హ ఒక వైపున ఆరాధనల్లో ఏకాగ్రచిత్తుడుగా పేరుగాంచితే, మరో వైపున శుభకార్యాల కొరకు ప్రజలను పురమాయించడంలోనూ మున్ముందు ఉండేవారు. *(సియర్ ఏలామున్నబ్‌లా)*

## బద్ర్ నిశీధిలో విశ్వాసాన్ని ద్విగుణీకృతం చేసే దృశ్యం

ఇస్లామ్‌లో కదన రంగం, ఖాన్‌కాహ్‌ల రంగం అన్న వేర్వేరు రంగాల విభజన లేదు. కొంతమంది కదన రంగంలో అసత్యానికి వ్యతిరేకంగా కాలు దువ్వితే, మరికొంతమంది ఖాన్‌కాహ్‌లలో, ఆశ్రమాలలో ధ్యానంలో మునిగి ఉండాలని ఇస్లామ్ చెప్పదు. సత్యధర్మ ధ్వజవాహకులు కదన రంగాన్నే ఆరాధనాలయంగా చేసుకుంటారు. దైవ సందేశహరుని (సఅసమ్) అత్యుత్తమ ఆదర్శం ఇచ్చే సందేశం ఇదే.

బద్ర్ రణరంగంలో- సత్యాసత్యాల, ధర్మాధర్మాల మధ్యన విచక్షణా రేఖను గీసే, చరిత్ర గతినే మార్చే చరిత్రాత్మక యుద్ధం జరగబోతున్నప్పుడు దైవ సందేశహరుని (సఅసమ్) మనోవేదన ఎలా ఉందో ప్రియ సహచరుల ద్వారానే వినండి-

ఆ రాత్రి వర్షం కురిసింది. మేము వర్షం నుండి తలదాచుకోవడానికి చెట్ల క్రింద చేరాము. ఆ రాత్రి దాదాపు అందరూ నిద్రపోయారు- ఒక్క దైవప్రవక్త(స) తప్ప. ఆయన ఒక వృక్షం క్రింద నమాజ్ చేస్తున్నారు. దుఃఖంతో విలపిస్తూ తన ప్రభువును ఇలా వేడుకుంటున్నారు : "దేవా! నీవు నాకు చేసిన వాగ్దానాన్ని నెరవేర్చు. నీవు నాకు ప్రసాదిస్తానని ఇచ్చిన మాటను నిలబెట్టుకో. దేవా! ఒకవేళ నీవు గనక ఇస్లామ్ ధర్మావలంబీకులైన ఈ గుప్పెడు మంది సమూహాన్ని అంతమొందిస్తే, ఇక ఈ భువిలో నిన్ను ఆరాధించేవారెవరూ ఉండరు." ఆయన ఖిబ్లా వైపునకు అభిముఖులై, రెండు చేతుల్ని ఎత్తి తన ప్రభువుకు విన్నపాలు చేసుకుంటున్నారు. ఆ ప్రయత్నంలో ఆయన దుప్పటి ఆయన భుజ స్కంధాలపై నుండి జారిపోయింది. తెలతెలవారుతుండగా ఆయన, "ఓ దైవదాసులారా! నమాజు కొరకు రండి" అని పిలిచారు. మేము చెట్ల క్రింద నుండి లేచి వచ్చాము. (ముస్నద్ అహ్మద్)

## అల్లాహ్‌ను అత్యధికంగా స్మరించాలి

అల్లాహ్‌ను అత్యధికంగా స్మరిస్తూ ఉండాలని దివ్య ఖుర్‌ఆన్‌లో పదేపదే ఉపదేశించటం జరిగింది. ఆ మేరకు ఆజ్ఞాపించడంతో పాటు, అది విశ్వాసుల ప్రత్యేక లక్షణమని కూడా నొక్కి వక్కాణించటం జరిగింది. అలాంటి కొన్ని ఉదాహరణల్ని చూడండి-

1) "నీవు నీ ప్రభువును ఎక్కువగా స్మరించు." (ఆలె ఇమ్రాన్ : 41)

2) "విశ్వాసులారా! మీరు ఒక వర్గాన్ని ఎదుర్కొన్నప్పుడు స్థయిర్యంతో ఉండండి. అల్లాహ్‌ను అత్యధికంగా స్మరించండి. మీకు విజయభాగ్యం కలుగుతుందని ఆశించవచ్చు." *(అల్ అన్‌ఫాల్ : 45)*

3) "అల్లాహ్‌ను అత్యధికంగా స్మరించే స్త్రీలు, అత్యధికంగా స్మరించే పురుషులు- అల్లాహ్ వారి కొరకు గొప్ప ప్రతిఫలాన్ని సిద్ధపరచి ఉంచాడు" *(అల్ అహ్‌జాబ్ : 35)*

4) "విశ్వసించిన ప్రజలారా! అల్లాహ్‌ను అత్యధికంగా స్మరించండి." *(అల్ అహ్‌జాబ్ : 41)*

5) "అల్లాహ్‌ను అత్యధికంగా స్మరిస్తూ ఉండండి. బహుశా మీకు సాఫల్య భాగ్యం కలగవచ్చు." *(అల్ జుముఅహ్ : 10)*

**ఇంకా చూడండి : (అష్ షుఅరా : 227; అల్ అహ్‌జాబ్ : 21, అల్ హజ్జ్ : 39,40)**

అల్లాహ్‌ను అత్యధికంగా స్మరిస్తూ ఉండండి అంటే అర్థం మనిషి ఎంతసేపటికీ దైవనామస్మరణ జరిగే సమావేశంలో తనను కట్టి పడేసుకోమని కాదు. సత్యాసత్యాల సంఘర్షణలో కూడా విశ్వాసులను దైవనామస్మరణ చేసేవారుగా ఖుర్‌ఆన్ చూడదలుస్తున్నది.

✤

**(మిగతా వచ్చేవారం)**

# "2025" పేజీని అందంగా రాయండి




ముహమ్మద్ ముజాహిద్

**ఆరోగ్యం, తీరిక సమయం ఇవి రెండూ దేవుడు ప్రసాదించిన రెండు గొప్ప వరాలు.** ఈ రెంటి విషయంలో మనిషి ఏమరుపాటుకు, నష్టానికి గురవుతాడు. **- ముహమ్మద్ (స)**

ఐదు విషయాలను ఐదు విషయాలకు పూర్వం మేలైనవిగా భావించండి. యవ్వనాన్ని వృద్ధ్యాప్యానికి పూర్వం, అరోగ్యాన్ని అనారోగ్యానికి పూర్వం, కలిమిని లేమికి పూర్వం, తీరిక సమయాన్ని పనుల్లో లీనమవ్వక పూర్వం, జీవితాన్ని మరణానికి పూర్వం మేలైనవిగా భావించండి. **- ముహమ్మద్ (స)**

ఆణిముత్యాల్లాంటి ఈ ప్రవక్త ప్రవచనాలు సమయం విలువను, కాలం గొప్పతనాన్ని తెలియజేస్తాయి. ఒక మనిషి పరాజితుడో, విజయవంతుడో తెలుసుకోవడానికి అతను తన సమయాన్ని, డబ్బును వినియోగించే విధానాన్ని గమనిస్తే సరిపోతుంది. ఏడాది కాలం విలువ తెలుసుకోవాలంటే పరీక్షల్లో ఫెయిలైన విద్యార్థిని అడిగి చూడాలి. ఒక నెల విలువ తెలియాలంటే ఆ నెల జీతం రాని ఉద్యోగిని అడగాలి. దవాఖానలో వైద్యం కోసం చేరిన రోగి ఒక వారం రోజుల విలువెంతో మనకు వివరిస్తాడు. ఒక్క రోజు విలువ గురించి తెలుసుకోవాలంటే ఒక రోజంతా ఉపవాసమున్న వ్యక్తిని పరిశీలించాలి. ఎవరి కోసమైనా ఎంతో ఆతృతతో ఎదురు చూస్తున్న వ్యక్తిని అడిగి చూస్తే గంట సమయం ఎంత విలువైందో మనకు తెలు స్తుంది. ఒక్క నిమిషం ఎంత విలువైందో చివరి నిమిషంలో రైలు అందుకోలేకపోయిన ప్రయాణికుడిని చూస్తే అర్థమవుతుంది. రెప్పపాటులో ప్రమాదం నుంచి ప్రాణాలతో బయటపడిన వ్యక్తి మనకు సెకను విలువను విడమరచి చెప్తాడు. సమయం విలువను మంచు దిమ్మల వ్యాపారి ద్వారా చక్కగా అర్థం చేసుకోవచ్చు. "నా పెట్టుబడి బజారులో కరిగిపోతూ ఉంది. నాపై కనికరం చూపండి" అని అతడు కేకలు వేస్తూ తన జీవనోపాధిని కొనసాగిస్తాడు. దీన్ని బట్టి జీవితంలో ప్రతి క్షణం, ప్రతి గంట, ప్రతి రోజు విలువైందేనని మనకు అవగతం అవుతుంది.

ఇంతటి విలువైన సమయాన్ని దుర్వినియోగం చేసుకున్న వారు తీవ్ర నష్టానికి గురవుతారని ఖుర్ఆన్ హెచ్చరిస్తోంది. ఇస్లామీయ ఆరాధనలన్నీ సమయపాలనను నేర్పుతాయి. ఐదు పూటలా నమాజ్ వేళప్రకారం చేయాలి. మక్కా యాత్రను జిల్ హజ్ నెలలో పూర్తి చేస్తేనే హజ్ క్రతువు పూర్తవుతుంది. ఉపవాసాలు రమజాన్ నెలలో పాటిస్తేనే వాటి ఉద్దేశం నెరవేరుతుంది. ఇలా ప్రతీ ఆరాధనా సమయ పాలనను, సమయ ప్రాముఖ్యతను, నిర్దిష్ట కాల పరిమితిలో దాన్ని పూర్తి చేయాల్సిన ఆవశ్యకతను మనకు తెలియజేస్తాయి. మనిషికి ఉండాల్సిన అసలైన సంపద ఈ లోకంలో వేగంగా పరుగెడుతున్న సమయాన్ని సద్వినియోగం చేసుకోవడమేనన్న విషయం ఇస్లాం బోధనలు మనకు తెలియజేస్తాయి. మన "జీవిత కాలాన్ని" తప్పుడు పనుల్లో వెచ్చిస్తే ఆ కాలమే మనల్ని వినాశనం చేస్తుంది.

ఇంతటి విలువైన సమయాన్ని నేడు కొందరు టైమ్ పాస్ చేసి గడపడం ఫ్యాషనైపోయింది. కొంతమంది నిద్రకే ఎక్కువ

కాలాన్ని కేటాయిస్తారు. మనిషి సగటు జీవితం 60 ఏండ్లు. ఇందులో 20 ఏండ్లు నిద్రకే పోతుంది. మిగిలిన 40 ఏండ్ల కాలంలో మనిషి తన జీవితాన్ని సవ్యంగా, మంచి పనుల్లో గడపాలి. అలా చేస్తేనే చనిపోయాక సమాధిలో వేల సంవత్సరాలు పుణ్యఫలంతో హాయిగా విశ్రాంతి తీసుకోవచ్చు. కాలం కత్తి లాంటిదంటారు ఇమామ్ షాఫయీ రహ్మాలై. కాలాన్ని సద్వినియోగం చేసుకోకుంటే అది కత్తిలాగా మనల్ని పొడిచేస్తుందని ఆయన అంటారు. జీవితం చాలా చిన్నది. ప్రవక్త హజ్రత్ నూహ్(అలై) మరణ సమయం ఆసన్నమైన ప్పుడు ఈ ప్రపంచాన్ని ఎలా అనుభవించారు? అని మృత్యుదూత అడిగాడు. 'నేను ఇంటిలోని ఒక తలుపు నుండి ప్రవేశించాను. మరో ద్వారం గుండా వెళ్లిపోతున్నాను' అంటూ జీవితం క్షణ భంగురమైనదనే విషయాన్ని సరళంగా వివరించారు. వేలాది సంవత్సరాల క్రితం నూహ్ సుమారు వెయ్యి సంవత్సరాలు జీవించారు.

## రాతలు..... గీతలు...!

చేతిలోని గీతల్ని పదే పదే చూసుకొని మురిసిపోకు
అవి నీ జాతకాన్ని మార్చే అదృష్ట రేఖలు కావు
ముఖంలోని ముడతలు చూసి అదే పనిగ దిగులు పడకు
అవి నీ ఎత్తు పల్లాలను చూయించే ప్రతిబింబాలు
నెరిసిన జుట్టును చూసి కుమిలి పోకు
అవి నీ పరిపక్వపు ఆలోచనలకు నిదర్శనాలు
రాశిఫలాలను చూసుకుని రాత మారబోతుందని భ్రమ పడకు
నీ స్వయంకృషితోనే రాతలైన గీతలైనా మారిపోగలవని తెలుసుకో.....!
కాళ్లు తడబడుతున్నాయని కుంగిపోకు
నువ్వు బాల్యంలో వేసింది తప్పటడుగులేనని గుర్తుపెట్టుకో
నుదుటి రాతను పైవాడు సరిగ్గా రాయలేదని బాధపడకు
నువ్వు తలుచుకుంటే కొత్త చరిత్రను లిఖించగలవని తెలుసుకో...

**- డాక్టర్.మహమ్మద్. హసన్**




అందుకే ఈ చిన్నజీవితాన్ని అర్థవంతంగా గడపాలంటారు ప్రవక్త మహనీయులు. 'ఏ వ్యక్తి రెండు రోజులు ఒకేలా గడిస్తే అతను వినాశనం పాలైనట్లే' అన్నారు హజ్రత్ అలీ. నిన్నటి రోజు కంటే ఈ రోజు మరింత అర్థవంతంగా గడవాలన్నదే ఆయన ఉద్బోధ. వివేకవంతుడైన వ్యక్తి తన సమయాన్ని నాలుగు భాగాలుగా విభజించుకోవాలంటారు ప్రవక్త ఇబ్రాహీం(అలై). ఒక భాగం దైవారాధన కోసం, ఆత్మ పరిశీలన కోసం ఒక భాగం, సృష్టి పరిశీలన కోసం మరో భాగాన్ని, తన కోసం, తన కుటుంబం కోసం నాలుగో భాగాన్ని విభజించు కోవాలని చెప్పారు.

ఇవే నా చివరి క్షణాలన్న స్పృహతో జీవితం గడపాలంటారు ఇమామ్ గజాలి. గడిచిపోయిన కాలాన్ని గురించి చింతిస్తూ కూర్చోకూడదు. అలాగే రాబోయే భవిష్యత్తు గురించి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆయన అంటారు. మన చేతిలో ఉన్న వర్తమాన కాలంలో సంతృప్తిగా, దైవాదేశాలకు కట్టుబడి జీవిస్తే జీవితం సాఫీగా సాగిపోతుంది అంటారు. జీవితమనే గ్రంథంలో 2024 సంవత్సరం అనే పేజీకి వీడ్కోలు పలుకుతున్నాం. 2025 అనే ఖాళీ పేజీని తెరవబోతున్నాము. ఇప్పుడా పేజీని అందంగా మలుచు కుందాం. ఇందులో మంచి కథలు, కథనాలు రాయడమనేది మీ చేతిలోనే ఉంది. మీ మంచి ప్రవర్తన, మంచి ఆలోచన లతో మీ జీవిత గ్రంథంలో మంచి స్టోరీని మొదలెట్టండి. గత పేజీలను చూసి కుమిలిపోయేలా కాకుండా, గర్వపడేలా చూసుకోండి. హ్యాపీ న్యూ ఇయర్!



# హృదయ ఫలకంపై పదిలంగా నిలిచిపోయిన
# జమాఅతె ఇస్లామీ జాతీయ సదస్సు

**- షేక్ అబ్దుల్ సమద్, నంద్యాల**

**జమాఅతె ఇస్లామీ హింద్** జాతీయ మహాసభలు తెలంగాణ రాజధాని నగరం హైదరాబాదులో నవంబర్ 15-17 తేదీలలో జరిగి అపుడే నెల దాటి పోయింది. అయినా ఆ మహాసభల జ్ఞాపకాలు నా మనోఫలకంపై అలా శాశ్వతంగా ముద్రించబడి మాటిమాటికి గుర్తుకొస్తున్నాయి. ఇప్పటికి ఆ సమావేశాలు, ఆ ప్రసంగాలు, ప్రదేశాలు నా మదిలో అలా మెదులుతూనే ఉన్నాయి. ప్రతి కార్యక్రమం ఎంతో ప్లానింగ్‌తో కంపూటరైజ్డ్‌గా, సాంకేతిక తులమానంతో తీర్చదిద్దబడినట్లు జరిగిపోయాయంటే వాటి వెనుక ఎంతో ఓర్మి, శ్రమ మేళవించబడ్డాయో ఇట్టే అర్థం అవుతుంది.

“అద్ల్-ఒ-కిస్త్” ముఖ్యాంశంగా జాతీయ సమావేశాలకు సభ్యులను సమాయత్తం చేస్తూ సమయానుకూలంగా జాతీయ, రాష్ట్ర స్థాయి నాయకత్వాల సూచనలు, ప్రోగ్రాంలు సమావేశ వివరాలు ప్రతి యూనిట్‌కు చేరుతుండటం, ప్రతి సభ్యుడు నిర్దేశించిన ‘ఆప్’ ద్వారా అప్డేట్ అవుతుండటం జేఐహెచ్ సాంకేతిక పరిణతికి తార్కాణం. ఉదయం ఫలక్‌నుమా రైల్వే స్టేషన్ చేరుకుంటూనే సిద్ధంగా ఉన్న వాలంటీర్లు రిసీవ్ చేసుకునేవారి ఆహ్వానంతో మా అలసట మరిచిపోయి ఆటోలో జాతీయ ఇజ్తిమా ప్రాంగణానికి చేరుకున్నాం. పెద్ద కమాన్ స్వాగతం పలికింది. లోపలికి ప్రవేశిస్తూనే నీట్‌గా తీర్చిదిద్దిన జాతీయ సదస్సు ఐకాన్ స్వాగతం పలికింది. ఒకవైపు మిని హజ్ క్యాంపా లేదా ఏదైనా కంటోన్మెంట్ ఏరియానా అన్ని సందిగ్ధం కలుగకమానదు. పెద్ద పెద్ద గుడారాలు చక్కగా తీర్చబడి ఉన్నాయి. రిసిప్షన్ సూచనల ప్రకారం మాకు కేటాయించిన విడిది చేరుకున్నాం. రాష్ట్రాల వారిగా క్యాంప్‌లు వరుస క్రమంలో ఏర్పాటు చేయ బడ్డాయి. ప్రతి క్యాంప్ వద్ద భోజనశాలలు వుజూఖానా, టాయిలెట్లు అమర్చబడి ఉన్నాయి.

మాకు కేటాయించిన గుడారంలో రిలాక్సయి, టిఫిన్ ముగించుకుని ఇజ్తిమాగాహ్ చేరుకున్నాం. సమావేశ ప్రాంగణం ముందు మూడు మాసాలుగా అహర్నిశలు శ్రమించి నిర్మించిన టౌన్‌షిప్‌లో ఇంకేదయినా కొరత ఉందేమో బేరీజు వేసుకుంటు వచ్చే ప్రతి వ్యక్తికి స్వాగతం పలుకుతున్నారు జాతీయ ఇజ్తిమా ఆర్గనైజర్ అబ్దుల్ జబ్బార్ సిద్దీఖీ గారు. నన్ను ఆలింగనం చేసుకుని తన పట్టణవాసి అంటూ ఆప్యాయంగా పలకరించిన తీరు నాకు ఒకింత గర్వానికిలోను చేసింది. జబ్బార్ సిద్దీఖీ గారి కరచాలనం మూడురోజుల ఇజ్తిమాలో నాకు ఓ ఆక్సిజన్‌లా పనిచేసింది.

స్వాగతోపన్యాసంలో జబ్బార్ సిద్దీఖీ వలంటీర్స్‌తో కొండ గుట్టలను తొలిచి ఇజ్తిమా యోగ్యంగా మలిచిన తీరు, వారు అహోరాత్రులు శ్రమించిన ఘటనలు వివరిస్తుంటే హృదయాలు చలించి పోయాయి. వాస్తవానికి జబ్బార్ గారు ఏడాది కిందే జాతీయ సమావేశాలకు వేదికగా హైదరాబాద్ నగరం ఎన్నుకున్నప్పుడు ఆయనలోని ఆలోచనలు ఓ సుందర వేదికకు రూపునిచ్చింది. జబ్బార్ గారు పలు ప్రదేశాలు సందర్శించినా 1997, 2015లో 'ఆల్ ఇండియా మెంబెర్స్ మీట్' జరిగిన ప్రదేశం వైపే మొగ్గు చూపారు. 51 ఎకరాల్లో విస్తరించి వున్న వాదియేహుదాలో 20వేల మంది సభ్యులు, మరో ఐదు వేల మంది అతిథులు, వాలంటీర్స్ తదితర సహాయక డిపార్ట్మెంట్స్ కోసం కనీసం 35 ఎకరాల కొండ మైదానంలో సువిశాల భూమిని తన అనుభవాన్ని, సాంకేతిక పరిజ్ఞానాన్ని రంగరించి మైక్రో ప్లానింగ్ ద్వారా జమాత్ క్యాడర్ సహకారంతో చూపరులు అబ్బురపడే విధంగా మార్చివేసారు. హైదరాబాద్ ఎంపి, ఎంఎల్ఏలు, పోలీస్, ప్రభుత్వ సహకారంతో 40అడుగుల వెడల్పుతో 1500 అడుగుల పొడవైన రోడ్లు, రెండు కిలో మీటర్ల స్ట్రీట్ లైట్లు, పూర్వం జెఐహెచ్ డొనేట్ చేసిన స్థలం నుండి 50లక్షల లీటర్ల నీటి సరఫరా నిరంత రాయంగా జరిగే విధంగా ఏర్పాట్లు జరిగిపోయాయి.

దేశ నలుమూలల నుండి వచ్చే సభ్యుల భోజన తదితర ఏర్పాట్లకు క్రమశిక్షణతో సేవలందించిన 2500 మంది వాలంటీర్‌లు (500 మంది మహిళలు) సేవలు అమోఘం. సభ్యుల రక్షణ కోసం సుశిక్షితులైన జమాఅత్ అనుబంధ హెచ్ ఆర్ఎస్ (కర్నాటక), ఐఆర్‌డబ్ల్యు (కేరళ) జమాఅత్ కేంద్ర ఎస్బిఎఫ్ సెక్యూరిటీ సర్వీసులు తప్పక గుర్తు చేసుకోవాలి. రాత్రి కూడా చలిలో సైతం గుట్టలపై నిలచి పహారా కాశారు.

5వ అఖిల భారత ఆల్ ఇండియా ఇజ్తిమా-ఎ-అరకాన్‌లో సభ్యులు సైతం అంతే తన్మయత్వంతో లీనమయ్యారు. చిత్తశుద్ధితో ప్రతి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎనభై తొంభై దశకాల వయసులో వృద్ధులు, మౌలానా రహ్మతుల్లాహ్ షరీఫ్, ఎస్.ఎం.మలిక్ గారు, వీల్ ఛైర్లలో కాళ్ళు చేతులకు బ్యాండేజ్ కట్టుకొని కొందరు, ఊతకర్రలతో మరి కొందరు, శరీరం వంగినా ఉత్సాహంగా పాల్గొన్న తీరు కళ్ళలో తెలియకుండానే భాష్పాలు వర్షించాయి. జనాబ్ టీ. ఆరిఫ్ అలీ, కేంద్ర ప్రధాన కార్యదర్శి నివేదిక ప్రకారం గత పదేండ్లలో జమాఅత్ 722 మంది సభ్యులు దైవ సన్నిధికి చేరుకున్నారు. అందులో 482 మంది కరోనా కాలంలో దూరమయ్యారు. ఇలాంటి సర్వ సభ్య సమావేశాలలో పాల్గొనే భాగ్యం కలుగటం దైవ చిత్తమే! పదేండ్లలో పురుష సభ్యులలో 68%, మహిళల్లో 248% పెరుగుదల జమాత్ విస్తరణకు తార్కాణం. నాయకుల ఆర్భాట డాంభికాలు అసలే లేవు. అమీరే జమాత్, ఖయ్యిమే జమాత్, అమీరే హల్ఖాలు సైతం సామాన్య సభ్యులతో కలిసి తమతమ విడిదులలో ఇమిడి పోయారు. అమీర్-ఎ-జమాఅత్ జనాబ్ సాదతుల్లా హుసేనిగారు రెండవ రోజు వివిధ అంశాలపై జరిగిన సదస్సులో భాగంగా మీడియా అంశంపై జరిగిన సమావేశంలో అందరు సభ్యులతో కలిసి క్రింద కూర్చున్న సంఘటన చాలు జమాఅత్ నాయకత్వ ఔన్నత్యానికి మచ్చుతునక! కేంద్ర రాష్ట్ర నాయకత్వం మూడురోజులు ఇజ్తిమా ప్రదేశంలో సామాన్య సభ్యులతో గడిపారు. రాత్రులు తమ సభ్యులు శయనించిన గుడారాలలో జాతీయ అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, జాతీయ కార్యదర్శులు సందర్శించి డేరాలలో సభ్యులు ఖుర్‌ఆన్ పారాయణం, తహజ్జుద్ నమాజులలో లీనం కావడం చూసి ఇలాంటి ఉత్తమ సమాజ ప్రదాతలు జమాఅతె ఇస్లామీ కలిగి ఉన్నందుకు దుఆ చేసిన సంఘటనలు ఎలా మరవగలం?




జాతీయ సదస్సులో సామూహికంగా నమాజు కోసం రూపొందించిన తాత్కాలిక మస్జిద్ కార్వాన్ కే హైలెట్‌గా నిలిచింది. ఓ వైపు చారిత్రక మస్జిద్-ఎ-అఖ్సా నమూనా, వేల మంది నమాజు ఆచరించుటకు అనువుగా ఆకుపచ్చ తివాచి పరిచి మనసు లగ్నం చేసే వాతావరణం నిండుగా అగుపించేది. సమయానుకూలంగా శ్రావ్యంగా వినిపించే అజాన్ పిలుపు సభ్యుల సమూహాలపై వింజామరలు వెదజల్లేవి. ఓ రోజు ప్రజల కోసం బహిరంగ సభ, ఆటవిడుపుగా ఏర్పాటు చేసిన ముషాయిరా, జాతీయ కవి సమ్మేళనాలకు తలదన్నే విధంగా ఇస్లాం సంస్కృతికి ప్రతిబింబంగా నిలిచింది. మహిళలకు ప్రత్యేక డార్మెంట్రి, పురుషుల కోసం రెండు డార్మెంట్రీలు వాతావరణ ప్రభావానికి అనుకూలంగా అందంగా అమర్చారు. పారిశుధ్య పనులు చకచకా నిర్వహిస్తూ, పరిశుభ్రత పరంగా చాలా శ్రద్ధ చూపబడింది. ప్రతి ఒక్కరికి వేదిక, ప్రసంగాలు అగుపించేలా వినిపించేలా స్క్రీన్, మైక్, లైటింగ్ సిస్టం చక్కగా ఏర్పరిచారు. వివిధ ప్రాముఖ్యతలకు ప్రతిబింబంగా వెలసిన ముఖద్వారాలు ప్రతి గేట్ ఒక పేరుతో ఆదర్శంగా నిలిచాయి. దేశ వ్యాప్తంగా వివిధ ప్రదేశాల్లో జమాఅతె ఇస్లామీ సేవలు ప్రస్ఫుటించే విధంగా "IDRAAK నామంగా ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను సభ్యులు ఆసక్తిగా తిలకించారు. మర్కజ్, టిప్ తదితర పుస్తక విక్రయ కేంద్రాలతో పాటు వివిధ సంస్థల ఎక్స్‌పో విరామ సమయాల్లో సభ్యులు సందర్శించారు. మూడు రోజులు ప్రశాంతంగా, క్రమశిక్షణతో అడుగడుగునా నిరాండబరంగా వేల మందితో నిర్వహించిన ఇజ్తిమా నిర్వహణ తీరు హైదరాబాదీయులు, పోలీస్ ఇంటెలిజెన్స్, జర్నలిస్టులను ఒకింత మంత్రముగ్దుల్ని చేసింది.

ఇక ప్రసంగాల అంశం స్పర్శిస్తే మూడురోజులుగా వివిధ అంశాలతో జరిగిన ఉపన్యాసాలు మననం చేసుకుంటే ఓ సంపుటే అవుతుంది. ప్రతి ప్రసంగపు మాట డైయిరీలోనే కాదు మదిలో శాశ్వితంగా లిఖించదగ్గ విలువైన అంశమే! జాతీయ అధ్యక్షులు జమాఅత్ క్యాడర్ దేశప్రజలతో అడుగులు కలపాలని చేసిన నిర్దేశాలు, శాంతి సౌభ్రాతృత్వం కోసం నిలవాలని, సాటి ప్రజలతో మమైకం అగుటకు 2025 సంవత్సరాన్ని మేల్కొల్పుతూ ప్రకటించిన "RISE" నినాదం సభ్యుల వెన్నుతట్టి నిలిపింది. ప్రతి అవకాశం, ప్రతి సమావేశం సభ్యులు సద్వినియోగం చేసుకోవాలని సమాయత్తం చేశారు. మౌలానా మొహియుద్దీన్ గాజీ గారి దర్సే ఖుర్‌ఆన్‌తో ప్రారంభమైన కార్యక్రమాల్లో వివిధ అంశాలపై పలువురు ప్రసంగించారు. 'వర్తమాన కాలంలో ప్రవక్త (స) జీవిత చరిత్ర మార్గదర్శకం' అన్న అంశంపై జాతీయ ఉపాధ్యక్షులు మౌలానా వలిఉల్లాహ్ సయీదీ ఫలాహీ తదితరులు విలువైన ప్రసంగాలు చేశారు. ప్రజల వాణిగా మారుతూ, ఇస్లాం ధ్వజవాహకులుగా స్థిరంగా నిలుస్తామని 'తజ్దిద్-ఎ-అహద్'గా ఇజ్తిమా ప్రాంగణం కంపించే విధంగా, గద్గద స్వరాలతో ముక్త కంఠంతో చేసిన ప్రమాణాలు హృదయాన్ని తట్టిలేపుతూనే ఉన్నాయి. మూడురోజుల సమావేశం అపుడే అయిపోయిందా అనుకుంటూ బస్సులో నుంచి మాటిమాటికి ప్రాంగణాన్ని తనివితీరా చూసుకుంటు చూసిన, విన్న విలువైన భావనలు నెమరేసుకుంటూ స్వస్థలాలకు బయలుదేరాం. ❖


యువతరానికి
విప్లవనాదం
చేతనవాదం

సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక

ఒక వారం చదవండి
ప్రతి వారం చదువుతారు !

చందా వివరాలు

| | |
|---|---|
| విడిప్రతి | ₹ 15 |
| ఆరు మాసాల చందా | ₹ 375 |
| సాలుసరి చందా | ₹ 750 |

ఆన్‌లైన్ ద్వారా పైకం చెల్లించి
గీటురాయి వారపత్రికను
తెప్పించుకోవచ్చు.

బ్యాంక్ అకౌంట్ వివరాలు
GEETURAI WEEKLY
Central Bank of India,
Noor Khan Bazar Branch, Hyderabad
A/c. No. 1042789768
IFSC Code. CBIN0282407

లేదా

పైకాన్ని యం.ఓ. లేక డి.డి. ద్వారా కూడా
పంపవచ్చు. డి.డి ద్వారా పంపదలిస్తే
డి.డి.ని 'Geeturai Weekly'
పేర మాత్రమే తీయాలి.

GEETURAI WEEKLY
SANDESHA BHAVANAM, LAKKADKOT,
CHATTA BAZAR, HYDERABAD - 500 002.
Phone: 24564583, 24576237
E-mail: geeturaiweekly@gmail.com

**"మీరు బలహీనంగా ఉన్నప్పుడు మిమ్మల్ని పుట్టించినవాడు అల్లాహ్‌యే. ఆ బలహీనత తర్వాత ఆయన మీకు శక్తి కల్గించాడు. ఆ శక్తి తర్వాత తిరిగి మిమ్మల్ని బలహీనులుగా, వృద్ధులుగా చేస్తున్నాడు. ఆయన తాను తలచిన దాన్ని సృజిస్తున్నాడు. ఆయన సమస్తం ఎరిగినవాడు, సర్వ శక్తిమంతుడు.**

**(రూమ్ / 51-54)**




వృద్ధులంటే జీవిత సారాన్ని గ్రహించిన అనుభవజ్ఞులు. ముదిమి వయస్సులో వారు కొన్ని పనులు చేసుకోలేరు. వారు సంతానంపై, తమ కంటే పిన్నలపై ఆధారపడతారు. వారిని గౌరవించి, సేవలు చేయడం పిన్నల విధి. వృద్ధుల విశిష్టతను, వారితో ఎలా ప్రవర్తించాలనే విషయాలను ఖుర్‌ఆన్ స్పష్టంగా వివరించింది. ''మీ ముందు వారిద్దరి (తల్లిదండ్రులు)లో ఎవరైనా వృద్ధులై ఉంటే వారిని 'ఉఫ్' అని కూడా విసుక్కోకండి. వారితో గౌరవంగా మాట్లాడండి. దయార్ద్ర హృదయంతో, వినయంతో వారి ముందు తలవంచి ఉండండి. ''ప్రభూ! వీరు నన్ను చిన్నతనంలో ఎలా కరుణతో, వాత్సల్యంతో పెంచి పోషించారో అలా నీవు వారిని కరుణించు'' అని ప్రార్థించండి. (బనిఇస్రాయీల్: 23, 24). అల్లామా షబ్బీర్ అహ్మద్ ఉస్మాని(రహ్మ)పై వచనానికి భాష్యం చెబుతూ ఇలా అభిప్రాయపడ్డారు- ''వృద్ధులకు సంతానంతో సేవలు చేయించుకోవాల్సిన అవసరం ఎక్కువగా ఉంటుంది. కొన్ని వేళల్లో అయినవారు కూడా వృద్ధులను విసుక్కుంటారు. వృద్ధాప్యంలో బుద్ధి వివేకాలు పని చెయ్యవు. ఇలాంటి సందర్భంలో గొప్ప సౌభాగ్యవంతులైన బిడ్డలు వృద్ధులైన తమ తల్లిదండ్రులకు సేవ చేయడంలో ఎలాంటి అలసత్వానికి, సోమరితనానికి, ఏమరుపాటుకి చోటివ్వకూడదు. వారికి సేవ చేయకుండా ఉండటానికి సాకులు వెతకకూడదు. సముద్ర కెరటాల్లా ఎగసిపడే మీ ఆలోచనలతో ఎగిరెగిరి అలసిపోయిన వారి ఆలోచనలు సర్దుబాటు కాలేకపోవచ్చు. అయినా మీరు వారిని ఉఫ్ అన్న చిన్నమాట కూడా అనడానికి వీలులేదు'' అని హెచ్చరిస్తోంది ఖుర్‌ఆన్.

## హదీసు వెలుగులో వృద్ధుల విశిష్టత

హజ్రత్ అబూమూసా (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త(స) ఇలా ప్రబోధించారు- ''అల్లాహ్‌ను గౌరవించడం, అభిమానించడంలో వృద్ధ ముస్లిముల పట్ల మర్యాదగా మసలుకోవడం కూడా ఇమిడి వుంది. (అబూ దావూద్)''

మరో సందర్భంలో ఆయన ఇలా అన్నారు. ''పిన్నలపై దయలేని వ్యక్తి పెద్దల హక్కులను వారి స్థానాన్ని, హోదాను గుర్తించని వ్యక్తి మనలోని వాడు కాదు'' (మిష్కాత్). దైవప్రవక్త(స) సంరక్షణలో శిక్షణ పొందిన హజ్రత్ సమురా బిన్ జున్దుబ్ (ర.అ) పెద్దలకు తాను ఇచ్చిన గౌరవాన్ని గురించి ఇలా తెలియజేశారు- ''నేను దైవప్రవక్త(స) శాంతి యుగంలో యువకుడిని. నేను ఖుర్‌ఆన్, హదీసుల కంఠస్థం చేసేవాడిని, దైవ వచనాలు, ప్రవక్త(స) ప్రవచనాలు నాలుకపై నానుతూ వుండేవి. అయినా మా మధ్య పెద్దలుండే వారు గనక ఏదైనా మాట్లాడాల్సి వస్తే వారే మాట్లాడేవారు. (చిన్నోడినైనా) నేను మౌనంగా (వారి మాటలు వింటూ) వుండేవాడిని.'' ఆయన ఖుర్‌ఆన్, హదీసుల పండితుడైనా (బుఖారి- ముస్లిం) కేవలం పిన్నవయస్సు కారణంగా తాను మాట్లాడకుండా పెద్దలకు అవకాశమిచ్చేవారు.

## వారి సారథ్యంలోనే సాఫల్యం

బుఖారీ (రహ్మ) తన పుస్తకం 'అల్ అదబుల్ ముఫ్రిద్'లో హకీమ్ బిన్ కైస్ బిన్ ఆసిమ్ (ర.అ) వృద్ధుల గొప్పతనాన్ని పేర్కొన్నారు. ఆయన గారి తండ్రి హజ్రత్ కైస్ బిన్ ఆసిమ్ (ర.అ) తన చివరి ఘడియల్లో తన సంతానాన్ని పిలిచి ఇలా హితవు చేశారు. ''నా కుమారుల్లారా! అల్లాహ్ పట్ల తఖ్వా కలిగి జీవించండి. మీ కన్నా పెద్దవారిని నాయకులుగా ఎన్నుకోండి. ఎందుకంటే.. ఏ జాతి అయితే తమ పెద్దల్ని నాయకుల్ని చేస్తుందో ఆ జాతి తమ తండ్రికి బదులు ప్రతినిధిగా నామకరణం చేస్తుంది. మరి ఎప్పుడైతే పెద్దల్ని విస్మరించి పిన్నల్ని నాయకుల్ని చేస్తుందో వారి ఈ ఎన్నిక వారి పాలిటే శాపమవుతుంది.

అపార కృపాశీలుడు పరమ కరుణామయుడు అల్లాహ్ పేరుతో

**తఫ్‌హీముల్ ఖుర్‌ఆన్: మౌలానా సయ్యిద్ అబుల్ ఆలా మౌదూది** **ఖుర్‌ఆన్ అవగాహనం: ఎస్.ఎమ్. మలిక్**

**59 ఆయత్‌లు** **మక్కా అవతరణ**

# 44. అద్ దుఖాన్

39 – 42 వీటిని మేము ధర్మబద్ధంగా సృష్టించాము, కాని చాలామంది ఎరుగరు.[34] వీరందరూ లేపబడేందుకు నిర్ణయమయిన సమయం తీర్పుదినం,[35] ఆ రోజున ఏ సన్నిహిత ఆప్తుడూ మరే సన్నిహిత ఆప్తునికి[36] ఏమాత్రం ఉపయోగపడడు, మరెక్కడి నుండీ వారికి సహాయమూ అందదు, అల్లాహ్ స్వయంగానే ఎవరిపైనయినా కటాక్షిస్తే తప్ప. ఆయన బలోపేతుడు, దయామయుడు కూడా.[37]

34. ఇది వారి అభ్యంతరానికి రెండవ సమాధానం. దీని భావమేమిటంటే, మరణానంతర జీవితం, పరలోకపు శిక్షా, బహుమానాలను నిరాకరించే వ్యక్తి వాస్తవానికి ఈ జగతి కర్మాగారాన్నంతటినీ ఒక ఆట వస్తువుగా, దీని సృష్టికర్తను ఏమీ తెలియని అవివేకి అయిన బాలుడుగా తలపోస్తున్నాడన్నమాట. ఈ కారణంగానే అతను, ప్రపంచంలో మానవుడు ఏ విధమయిన హంగామాలయినా చేసి ఒక రోజున ఇట్టే మట్టిలో మట్టి అయిపోతాడని, అతని మంచి పనికయినా చెడ్డ పనికయినా ఎటువంటి ఫలితమూ బయల్పడదని అభిప్రాయం ఏర్పరచు కున్నాడు. వాస్తవానికి ఈ విశ్వవ్యవస్థ ఏ ఆడుకునే పిల్లవాడు నిర్మించింది కాదు, విజ్ఞతా పరిపూర్ణుడయిన సృష్టికర్త నిర్మించిన జగత్తు. విజ్ఞుడయినవాడు ఏదయినా అర్థరహితమయిన పని చేస్తాడని ఆశించలేము. పరలోక తిరస్కారానికి సమాధానంగా ఈ వాదన దివ్య ఖుర్‌ఆన్‌లో అనేకచోట్ల వచ్చింది. మేము ఆయా స్థానాల్లో దాన్ని సవివరంగా విశదీకరించాము. (చూడండి ఖుర్‌ఆన్ అవగాహనం, సం.2, అల్ అన్ ఆమ్: పాద సూచి 46 సం.3, యూనుస్: పాద సూచికలు, 10,11 సం.4, అల్ అన్బియా: పాద సూచికలు 16, 17 సం.5, అల్ మూ'మినూన్: పాద సూచికలు 101, 102 సం.6, అర్ రూమ్: పాద సూచికలు 4–10).

35. వారు "నీవు చెప్పేదే నిజమయినట్లయితే, మా తండ్రీ తాతల్ని లేపి తీసుకు రా" అని చేసిన కోరికకు సమాధానం. భావమేమిటంటే, మరణానంతర జీవితం ఏదో తమాషా కాదు, ఎవరయినా దాన్ని నిరాకరించగానే వెంటనే ఒక మృతుని గోరీ నుండి లేపి అతని సమక్షంలో నిలబెట్టి చూపడానికి. దానికయితే విశ్వప్రభువు ఒక సమయాన్ని నిర్ణయించి పెట్టాడు. అప్పుడు తొలినాటి వారినీ తుదినాటి వారినీ మళ్ళీ బ్రతికించి తన న్యాయస్థానంలో సమావేశ పరుస్తాడు. వాళ్ళ కేసులు విచారించి తీర్పులు ప్రకటిస్తాడు. మీరు అవునన్నా కాదన్నా, ఈ పనిమటుకు దాని నిర్ణీత సమయానే జరిగి తీరుతుంది. మీరు నమ్మినట్లయితే అది మీకే మేలు. ఆ విధంగా ముందే జాగరూకులయి ఆ న్యాయస్థానంలో విజయులయి బయటపడేందుకు సన్నద్ధు లవగలరు. నమ్మకపోతే మీకే నష్టకరం. ఎందుకంటే అలాంటి సందర్భంలో జీవితం మొత్తాన్ని ఒక అపోహలో ధారపోస్తారు: మంచి అయినా చెడు అయినా ఉన్నదేదో అదంతా ఈ జీవితం వరకే పరిమితం. మరణం తరువాత న్యాయస్థానమంటూ నెలకొనేదేమీ లేదు, అందులో మా ఆచరణల మంచీ చెబ్బరల శాశ్వత పరిణామం బయల్పడటమంటూ ఉండదు అని అనుకుంటారు.

36. మూలంలో **'మౌలా'** అన్న పద ప్రయోగం జరిగింది. అరబీలో, ఏదయినా సంబంధం కారణంగా మరో వ్యక్తికి మద్దత్తు తెలిపే వ్యక్తిని ఉద్దేశించి మౌలా అని చెబుతారు. ఆ సంబంధం, బంధుత్వపు సంబంధమయినా, స్నేహమయినా మరెటువంటి సంబంధమయినా అన్నింటికీ అది వర్తిస్తుంది.

37. తీర్పుదినాన నెలకొల్పబడే న్యాయస్థానం తీరుతెన్నులెలా ఉంటాయో ఈ వాక్యాల్లో తెలుపడం జరిగింది. ఒకరి సహాయం, సమర్థన అక్కడ ఏ అపరాధినీ విడుదల చేయించ జాలదు, అతని శిక్షనూ తగ్గించజాలదు. అధికారాలన్నీ ఆ నిజ స్వామి, సర్వాధికారికే హస్తగతమయి ఉంటాయి. ఆయన తీర్పులు అమలు జరపడాన్ని ఏ శక్తీ అడ్డుకోజాలదు. ఆయన తీర్పులపైన ప్రభావం వేయగల శక్తి సామర్థ్యాలూ ఎవరికీ ఉండవు. ఇది కేవలం ఆయన విచక్షణాధికారానికి సంబంధించిన విషయం– ఎవరికయినా దయతలచి శిక్షించకపోవడమయినా వారి శిక్షను తగ్గించడమయినా వాస్తవంగా ఆయన ఘనత అందులోనే ఉంది– ఆయన న్యాయం చేయడంలో నిర్దయగా కాదు, దయతోనే వ్యవహరిస్తాడు. కాని ఎవరి కేసులో ఏ తీర్పు అయితే జరుగుతుందో అది మటుకు ఎట్టి పరిస్థితిలోను ఎటువంటి హెచ్చుతగ్గుల్లేకుండా అమలు జరిగి తీరుతుంది. దైవ న్యాయస్థానంలోని ఈ స్థితిగతుల్ని వివరించిన తరువాత ముున్ముందు కొన్ని వాక్యాల్లో ఆ న్యాయస్థానాన అపరాధులుగా రూఢీ అయిన వారి అంతిమ పరిణామం ఏమవుతుందో తెలుపడం జరిగింది. అలాగే ప్రపంచంలో దైవానికి భయపడి అవిధేయతలకు దూరంగా మెలిగేవారికి ఏ ఏ బహుమానాలు ప్రసాదించి ఆదరించడం జరుగుతుందో కూడా తెలుపడం జరిగింది.

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడు అల్లాహ్ పేరుతో

# సహీహ్ బుఖారీ (6వ సంపుటం)

ఉర్దూ అనువాదం: అల్లామా వహీదుజ్జమాఁ (ర.అలై)
తెలుగు అనువాదం : ముహమ్మద్ అజీజుర్రహ్మాన్

كِتَابُ الْمَغَازِي

## 4. యుద్ధాల ప్రకరణం -2
(కితాబుల్ మగాజీ)

### అధ్యాయం : 47

### మక్కా విజయానికి పూర్వం[1]

మక్కా వారిని అప్రమత్తం చేసే ఉద్దేశంతో హాతిబ్ బిన్ అబీ బల్తా వ్రాసిన ఉత్తరం గురించి...

**148)** హజ్రత్ అలీ(రజి) ద్వారా తాను విన్నానని ఉబైదుల్లాహ్ బిన్ రాఫే తెలియజేశారు: అలీ(రజి) ఇలా చెప్పారు– నన్నూ, జుబైర్‌ను, మిఖ్దాద్‌ను ప్రవక్త మహనీయులు(సఅసమ్) ఒక పనిపై పంపిస్తూ, "మక్కా మార్గంలో సాగిపోండి. 'రౌజాఖాఖ్' అనే చోటికి మీరు చేరుకోగానే ఒంటెపై స్వారీ అయి వెళుతున్న ఒక స్త్రీ మీకు కనిపిస్తుంది. ఆమె వద్ద ఒక ఉత్తరం ఉంది. దానిని మీరు తీసుకోండి" అని ఆదేశించారు. అలీ (రజి) ఇలా అన్నారు: మా గుర్రాలు మమ్మల్ని చాలా వేగంగా గొనిపోసాగాయి. మేము సరిగ్గా 'రౌజాఖాఖ్' ప్రదేశానికి చేరుకోగానే ఒంటెపై స్వారీ అయి వెళుతున్న ఒక మహిళ కనిపించింది (ఆమె పేరు సారా లేక కన్వర్). మేము ఆమెను ఆపి, "ఏదీ, నీ దగ్గర ఉన్న ఉత్తరం ఇటివ్వు" అని అడిగాము. దానికి ఆమె, 'నా దగ్గర ఉత్తరం గిత్తరం ఏమీ లేద'ని బుకాయించింది. 'చూడమ్మా! నీవు మర్యాదగా ఆ ఉత్తరం ఇస్తే సరి. లేకపోతే నిన్ను వివస్త్రను చేసి వెతకాల్సి ఉంటుంద'ని హెచ్చరించగానే, ఆమె ఆ ఉత్తరాన్ని తన జడలో నుంచి తీసి ఇచ్చింది.

మేము ఆ ఉత్తరాన్ని తీసుకుని దైవప్రవక్త(స) సేవలో హాజరయ్యాము– 'ఈ ఉత్తరం హాతిబ్ బిన్ అబీ బల్తా తరఫున...మక్కావారి పేర (సఫ్వాన్ బిన్ ఉమయ్యా, సుహైల్ బిన్ అమ్ర్, ఇక్రిమా బిన్ అబీ జహల్‌ల పేర)...' అని ఆ వ్రాత మొదలయింది. ఆ తరువాత, దైవప్రవక్త(స) త్వరలో మక్కా వారిపై దండయాత్ర చేయబోతున్నారన్న సమాచారం అందులో ఉంది. దైవప్రవక్త(స) హాతిబ్‌ను పిలిపించి, "హాతిబ్ ఏమిటిది?" అని నిలదీసి అడిగారు. దానికి ఆయన, 'దైవప్రవక్తా! నా వ్యవహారంపై నిర్ణయం గైకొనటంలో తొందరపడకండి. ఎందుకు అలా చేశానో మీకు వివరంగా చెబుతాను. అసలు విషయం ఏమిటంటే ఇతర ముహాజిర్ల మాదిరిగా నేను ఖురైషు వంశీయుణ్ణి కాను. కేవలం వారితో మైత్రీ సంబంధం మాత్రమే నాకు ఉంది. అయితే ముహాజిర్లందరికీ మక్కావారితో బంధుత్వ సంబంధం ఉంది. తత్కారణంగా మక్కా ఖురైషులు ఏదో ఒక విధంగా ముహాజిర్ల ఇల్లూ వాకిళ్ళను, సాధనా సంపత్తులను కనిపెట్టుకుని ఉంటున్నారు. (కాని నాకు ఆ అవకాశం లేదు) నేను వారికి ఏదైనా ఒక ఉపకారం చేస్తే, దానికి ప్రత్యుపకారంగా వాళ్ళు నా కుటుంబీకులకు కీడు తలపెట్టకుండా ఉంటారని భావించాను. ఇస్లామ్ నుండి తిరిగిపోయి నేను ఈ చేష్టకు ఒడిగట్టలేదు. నా హృదయంలో అవిశ్వాసం (కుఫ్ర్) భావన కూడా లేదు. నన్ను నమ్మండి' అని సంజాయిషీ ఇచ్చారు.

అంతా విన్న మీదట, "మీ ముందు ఇతను చెప్పినదంతా నిజం" అన్నారు దైవప్రవక్త(స). 'దైవప్రవక్తా! తమరు ఆనతినిస్తే నేను ఈ కపటి మెడ నరికేస్తాన'ని ఉమర్(రజి) విన్నవించుకోగా, 'వద్దు. ఇతను బద్ర్ సంగ్రామంలో

పాల్గొన్న యోధులలో ఒకడు. నీకేం తెలుసు? బద్ర్ సంగ్రామంలో పాల్గొన్నవారి పోరాట పటిమను (నింగినున్న) అల్లాహ్ వీక్షించాడు. (ముమ్తహినహ్ సూరాలో) అల్లాహ్ ఆ యోధుల గురించి ఇలా సెలవిచ్చాడు: "విశ్వసించిన ప్రజలారా! మీరు గనక నా మార్గంలో జిహాద్ చేయటానికీ, నా ప్రసన్నతను పొందటానికీ (స్వస్థలాన్ని విడిచి ఇళ్ల నుండి) బయలుదేరినపుడు నాకూ, మీకూ శత్రువులైన వారితో స్నేహం చేయకండి. అసలు మీరు వారితో స్నేహం ఎలా చేస్తారు; మీ వద్దకు వచ్చిన సత్యాన్ని వారు విశ్వసించటానికి నిరాకరించారు కదా! కేవలం మీరు మీ ప్రభువైన అల్లాహ్‌ను విశ్వసించారనే నేరంపై వారు దైవప్రవక్తనూ, స్వయంగా మిమ్మల్నీ దేశ బహిష్కరణకు గురి చేశారు. ఇదీ వారి వైఖరి. ఇలాంటి వారికి మీరు రహస్యంగా స్నేహ సందేశం పంపుతారా? వాస్తవానికి మీరు రహస్యంగా చేసేది, బహిరంగంగా చేసేది అంతా నాకు బాగా తెలుసు. మీలో అలా ఎవరు చేసినా అతను నిశ్చయంగా రుజుమార్గం తప్పిపోయినట్లే." *(అల్ ముమ్తహినహ్ 60: 1)*

## అధ్యాయం : 48

## మక్కా విజయం (హిజ్రీ 8, రమజాన్ నెలలో)

**149)** ఇబ్నె అబ్బాస్ (రజి) కథనం ప్రకారం ప్రవక్త మహనీయులు (సఅసమ్) రమజాన్ నెలలో మక్కాను జయించారు. ఇబ్నె అబ్బాస్(రజి) ద్వారానే మరో ఉల్లేఖనం : మక్కా విజయం సందర్భంగా ప్రవక్త మహనీయులు(సఅసమ్) ప్రయాణానికి బయలుదేరినప్పుడు ఉపవాసంతో ఉన్నారు. కాని ఆయన ఖుదైర్–ఉస్ఫాన్‌ల మధ్యన గల 'కదీద్' చెలమ దగ్గరకు చేరుకున్నప్పుడు ఉపవాసాన్ని విరమించారు. ఆ తరువాత దైవప్రవక్త(స) రమజాన్ నెల ముగిసేవరకూ ఉపవాసం పాటించలేదు.[1]

**150)** హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్(రజి) తెలిపారు : "ప్రవక్త మహనీయులు(సఅసమ్) మదీనా నుండి (మక్కా వైపునకు) ప్రయాణమయ్యారు. ఆ సమయంలో ఆయన(స) వెంట పది లేక పన్నెండు వేల మంది సైనికులున్నారు. అప్పటికి దైవప్రవక్త(స) మదీనాకు ఏతెంచి ఎనిమిదన్నరేండ్లు పూర్తయ్యాయి (అది రమజాన్ నెల). దైవప్రవక్త(స)తోపాటు ఆయన ప్రియ సహచరులు కూడా ఉపవాసం పాటిస్తూ ఉన్నారు. కాని ఖుదైర్–ఉస్ఫాన్‌ల మధ్యన గల 'కదీద్' అనే చెలమ దగ్గరకు చేరుకున్న మీదట ఆయన(స) ఉపవాసాన్ని భగ్నపరిచారు. సహచరమాన్యులు (రజి) కూడా తమ తమ ఉపవాసాలను భగ్నపరిచారు– జుహ్రీ ఇలా అన్నారు: దైవప్రవక్త(స) ఏదేని విషయంలో ఆఖరిలో ఆచరించినదే అనుయాయులకు అనుసరణీయం కావాలి.

47-1. హుదైబియా ఒడంబడికలోని ఒక షరతు ప్రకారం అటు ఖురైషుల మిత్ర పక్షాలుగానీ, ఇటు ముస్లింల మిత్ర పక్షాలు గానీ పరస్పరం కయ్యానికి కాలు దువ్వకూడదు. బనూబకర్ తెగవారు ఖురైషుల మిత్రపక్షంగా ఉండగా, బనూ ఖుజాఅ తెగవారు అకస్మాత్తుగా బనూ ఖుజాఅపై దండెత్తారు. ఈ సందర్భంగా ఖురైషులు బనూ బకర్‌కు సహాయం చేశారు. బనూ ఖుజాఅ తెగవారు దైవప్రవక్త(స) సన్నిధికి వచ్చి, ఈ నియమోల్లంఘనపై ఫిర్యాదు చేశారు. తత్కారణంగా దైవప్రవక్త(స) మక్కా వారిపై చర్య గైకొనవలసి వచ్చింది.

149-1. ఎందుకంటే ప్రయాణంలో బాటసారికి ఉపవాసాన్ని విరమించే అనుమతి ఉంది. అదీగాక ఉపవాసం వల్ల మనిషి సహజంగానే నీరసించిపోతాడు. మరీ ముఖ్యంగా జిహాద్ కొరకు వెళ్ళేవారు గనక ఉపవాసవ్రతం పాటించటం వల్ల లక్ష్యాన్ని ఛేదించటం కష్టతరమైపోతుంది. ఈ కారణంగానే- ఈ ప్రయాణంలో దైవప్రవక్త(స) ఉపవాసం పాటించలేదు. తన సహచరులకు కూడా ఉపవాసాలను విరమించమని సూచించారు. ఈ ఆజ్ఞ ఇప్పటికీ వర్తిస్తుంది. "మీలో ఎవరయినా వ్యాధిగ్రస్తులుంటే లేక ప్రయాణంలో ఉంటే, వేరే దినాలలో ఆ ఉపవాస దినాలను పూర్తి చెయ్యాలి." *(అల్ బఖరా : 184)*


‘చరితార్థులు’-2



# యన్. యం. ఖాజా మియాం రౌతార్

## (1880 -1954)

69




జాతీయోద్యమంలో భాగంగా మహాత్మాగాంధీ మార్గదర్శకత్వంలో సాగిన స్వదేశీ, ఖద్దరు ఉద్యమాలలో ప్రత్యేక శ్రద్ధ చూపించి అమితోత్సాహంతో పాల్గొన్న యన్.యం. ఖాజా మియాం రౌతార్ 1880లో తిరుచునాపల్లి జిల్లా పలక్కారైలో యన్. ముహమ్మద్ మియాం రౌతార్, ఆమినాబీ దంపతులకు జన్మించారు. మద్రాసులోని మద్రాస్ క్రైస్తవ కళాశాలకు చెందిన పాఠశాలలో ఐదవ తరగతి వరకు ఆయన చదువుకున్నారు. ఐదవ తరగతితో చదువు చాలించినా ఆయన ఉర్దూ, ఆంగ్ల, అరబిక్ భాషలలో మంచి ప్రవేశాన్ని సంపాదించారు. స్వదేశీ వైద్య విధానాలైన సిద్ధ, యూనాని లాంటి స్వదేశీ వైద్య విధానాల మీద పరిశోధనలు గావించారు. స్వయంగా తయారు చేసిన మందులతో స్వదేశీ వైద్యవిధానాల ద్వారా పేద ప్రజల ఆరోగ్య పరిరక్షణకు తోడ్పడ్డారు. చిన్ననాటనే తోళ్ళ పరిశ్రమకు అవసరమగు శాస్త్ర-సాంకేతిక పరిజ్ఞానాన్ని ఆకళింపు చేసుకున్న ఆయన నూతన సాంకేతిక ప్రయోగాలతో తోళ్ళ పరిశ్రమ రంగంలో అగ్రగామి అయ్యారు. ఒకవైపున పారిశ్రామిక రంగంలో విజయపరంపర సాగిస్తూనే మరోవైపున ఆంగ్లేయ ప్రభుత్వం ఆధిపత్యం నుండి స్వజనుల విముక్తి కోసం సాగుతున్న పోరాటాల వైపున ఆయన దృష్టి సారించారు. మహాత్మాగాంధీ విధానాల పట్ల ఆకర్షితులైన ఖాజామియాం ఖిలాఫత్-సహాయనిరాకరణ ఉద్యమంలో పాల్గొన్న ద్వారా జాతీయోద్యమంలో ప్రవేశించారు. స్వయంగా ఖద్దరు పరిశ్రమను ప్రారంభించి విదేశీ వస్త్రాలకు ధీటుగా అకర్షణీయమైన ఖద్దరు వస్త్రాలను ప్రత్యేకంగా తయారు చేయించి ప్రజలకు ఉచితంగా అందజేశారు. ఈ వితరణ వలన భారీ నష్టాలను అనుభవించాల్సి వచ్చిన ఆయన మడమ తిప్పలేదు, వితరణ ఆపలేదు. జాతీయోద్యమ నాయకులకు కూడా ఖద్దరు వస్త్రాలను అందజేస్తూ ఖద్దరు ఉద్యమ విస్తృతిలో పాత్రధారి అవుతున్నందుకు ఎంతగానో సంతోషించారు. 1918 లో మజ్లిస్-ఉల్-ఉలమా అను సంస్థతో పాటుగా అనాధ శరణాలయం స్థాపించారు. సన్మిత్రులు యం.జమాల్ ముహమ్మద్‌తో కలసి ధార్మిక-లౌకిక విద్య అందించేందుకు కృషి ప్రారంభించారు. ఈనాడు తమిళనాడు రాష్ట్రంలో అత్యుత్తమ విద్యా సంస్థగా పరిఢవిల్లుతున్న ‘జమాల్ ముహమ్మద్ కళాశాల (తిరుచునాపల్లి)’ 1951లో మజ్లిస్- ఉల్-ఉలేమా సంస్థ ఆవరణలో ఖాజా మియాం రౌతార్ మార్గదర్శకంలో పురుడు పోసుకుంది. అప్పటి నుండి చివరివరకు ఆ విద్యా సంస్థల అభివృద్ధి కోసం తన సర్వ సంపదలను, భూములను అర్పించిన యన్. యం. ఖాజా మియాం రౌతార్ 1954 నవంబర్ 14న దివంగతులయ్యారు. ✤



**9440241727**

బ్రిటిష్ పాలనను, దోపిడీని ఎదిరించిన భారతీయుల చరిత్రలో ప్రజల సమైక్యతే ప్రత్యేక లక్షణమని నిరూపించడం ధ్యేయంగా భారత స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్న ముస్లిం అమర వీరుల గురించి చరిత్రకారుడు, బహుగ్రంథకర్త **సయ్యిద్ నశీర్ అహమ్మద్** రూపొందించిన ఆల్బమ్ **‘చరితార్థులు’ - 2 (తెలుగు)** THE IMMORTALS- 2 (ఇంగ్లీషు) నుండి గీటురాయి పాఠకుల కోసం ప్రత్యేకం



- సల్మాన్ హైదర్

# భారతీయ రైల్వేలో 54,151 మంది గెజిటెడ్ అధికారులలో 463 మంది మాత్రమే ముస్లింలు

"భారతదేశంలోని ముస్లింలు - గ్రౌండ్ రియాలిటీస్ వర్సెస్ ఫేక్ నేరేటివ్స్ - అచీవ్‌మెంట్స్ & అకాప్లిష్‌మెంట్స్ (Muslims in India - Ground Realities Versus Fake Narratives - Achievements & Accomplishments) అనే కొత్త పుస్తకం ప్రకారం 166 ఏళ్ల భారతీయ రైల్వే (ఐఆర్)లోని మొత్తం 1.7 లక్షల మంది ఉద్యోగులతో ముస్లిం అధికారుల సంఖ్య సంతృప్తికరంగా లేదు.

- గెజిటెడ్ మరియు నాన్ గెజిటెడ్ ఉద్యోగులతో సహా భారతీయ రైల్వే IR లోని మొత్తం ఉద్యోగుల సంఖ్య జూలై 2023 నాటికి 1,218,221కి చేరుకుంది.
- 2008-09లో అప్పటి రైల్వే మంత్రి భారతీయ రైల్వే IRలో కేవలం రెండు శాతం ముస్లింలు మాత్రమే ఉన్నారని, 140,000 మంది రైల్వే ఉద్యోగులలో 30,000 మంది మాత్రమే ముస్లింలు ఉన్నారని అన్నారు.
- 2013లో రైల్వేలో 14 లక్షల మంది ఉద్యోగుల్లో 64,000 మంది ముస్లిం ఉద్యోగులున్నారని అధికారులు వెల్లడించారు.
- 2013లో మీర్జా సల్మా బేగ్ భారతదేశపు మొదటి గేట్ ఉమెన్ అయ్యారు.

- 2016లో, భారతీయ రైల్వేలలో ముస్లిములకు కేవలం 4.5 శాతం మాత్రమే ప్రాతినిధ్యం ఉందని, వారిలో 98.7 శాతం మంది తక్కువ స్థాయిలో lower levels ఉన్నారని వెల్లడైంది.
- రైల్వే బోర్డు ఏప్రిల్ 1951 నుండి 40 మంది చీఫ్‌లను చూసింది. కానీ ముస్లిం సమాజానికి చెందిన వారు ఎవరూ అందులో లేరు.
- ప్రస్తుతం, రైల్వే బోర్డు GMలతో సహా 40 మంది సభ్యులను కలిగి ఉంది. అయినప్పటికీ, రైల్వే బోర్డులో ముస్లింలు లేరు.
- రైల్వే బోర్డు లో మొత్తం గెజిటెడ్ స్టాఫ్ 1,111అందులో 13మంది ముస్లిములు.
- రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డులలోని మొత్తం గెజిటెడ్ స్టాఫ్ 51. అందులో ముస్లిమ్స్ ఒకరు
- ఇండియన్ రైల్వే జనరల్ మేనేజర్లు 29 మంది ఉండగా అందులో ఒకరు మాత్రమేముస్లిం.
- భారతీయ రైల్వేలో మొత్తం 54,151 మంది గెజిటెడ్ అధికారులలో కేవలం 463 మంది ముస్లింలు మాత్రమే ఉన్నారు
- ప్రస్తుతం, తొమ్మిది మంది రైల్వే సేఫ్టీ కమిషనర్‌లు (CRS) ఉన్నారు. ప్రస్తుతం, కమీషన్ ఆఫ్ రైల్వే సేఫ్టీ (CRS) లోని 35 మంది అధికారులలో ఒకరు ముస్లిం - అహ్మద్ నదీమ్ సిద్ధిఖీ, రైల్వే సేఫ్టీ డిప్యూటీ కమిషనర్ (మెకానికల్).
- భారతీయ రైల్వేలో డేడికేటేడ్ ఫ్రైట్ కారిడార్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (DFCCIL) అక్టోబర్ 2006లో ఏర్పాటు చేయబడింది.
- నేడు, డేడికేటేడ్ ఫ్రైట్ కారిడార్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ DFCCILలోని 151 మంది మధ్య స్థాయి అధికారులలో ఎనిమిది మంది ముస్లింలు ఉండగా, 39 మంది గల సీనియర్ మేనేజ్‌మెంట్ బృందంలో ఒక్క ముస్లిం కూడా లేరు.
- సెంటర్ ఫర్ రైల్వే ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్ (CRIS), యొక్క 49 మంది అధికారులలో ఒక ముస్లిం - SAM నఖ్వీ, EPS & MMIS జనరల్ మేనేజర్ ఉన్నారు.
- డిసెంబర్ 1986లో స్థాపించబడిన ఇండియన్ రైల్వే ఫైనాన్స్ కార్పొరేషన్ (IRFC) లో ముస్లింల సంఖ్య శూన్యం.
- రైల్ఇండియన్ రైల్వే ఫైనాన్స్ కార్పొరేషన్ నలుగురు ఉన్నతాధికారులలో ముస్లిములు ఎవరూ లేరు.
- రైల్‌బ్రైత్‌వైట్ & కో డిసెంబరు 1976లో భారత ప్రభుత్వ రంగ సంస్థగా నమోదు చేయబడి విలీనం చేయబడింది. రైల్వే మంత్రిత్వ శాఖ పరిపాలనా నియంత్రణలో ఆగస్టు 2010లో వచ్చింది. నేడు, దాని 23 మంది ఉన్నత అధికారులలో ఒక ముస్లిం - ముహమ్మద్ అసద్ ఆలం, ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్.
- రైల్ వికాస్ నిగమ్ (RVNL) ఎనిమిది మంది సభ్యుల బోర్డు కలిగి ఉంది. అందులో ముస్లిములు ఎవరూ లేరు.
- రైల్ వికాస్ నిగమ్ (RVNL)లో సీనియర్ ఉద్యోగులుగా 515 మంది ఉద్యోగులు ఉన్నారు. వారిలో ఒక్క ముస్లిం కూడా లేరు.
- రైల్‌సెంట్రల్ పబ్లిక్ సెక్టార్ ఎంటర్‌ప్రైజ్ (CPSE)లో 95 మంది ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు మరియు GMలు ఉన్నారు, కానీ అందులో ఎవరూ ముస్లిం కాదు.
- 1976లో స్థాపించబడిన ఇండియన్ రైల్వే కన్‌స్ట్రక్షన్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ (IRCON), మే 2024 నాటికి దాదాపు 1,260 మంది ఉద్యోగులతో దీని పేరు అక్టోబర్ 1995లో ఇండియన్ రైల్వే ఇంటర్నేషనల్ లిమిటెడ్‌గా మార్చబడింది.
- ఇండియన్ రైల్వే ఇంటర్నేషనల్ లిమిటెడ్ Indian Railway International Limited యొక్క 34 మంది అధికారులలో ఒకరు మాత్రమే ముస్లిం - మసూద్ అహ్మద్, చీఫ్ జనరల్ మేనేజర్ (HW)
- RailTel, నిర్వహణ బృందంలో 16 మంది అధికారులు ఉన్నారు కాని అందులో ముస్లిములు ఎవరూ లేరు.
- ఇండియన్ రైల్వే లోని 4,498 ప్రధాన విభాగాల అధిపతులలో కేవలం 36 మంది ముస్లింలు
- ఎనిమిది ఇండియన్ రైల్వే సంస్థలలో ముస్లిం గెజిటెడ్ అధికారి లేరు

**(మూలం: క్లారియన్ ఇండియా, డిసెంబర్ 22, 2024)**

(జనవరి 9 ఫాతిమా షేక్ జయంతి)

1851లో ఆమె స్వయంగా ముంబైలో రెండు పాఠశాలలు స్థాపించారు. దళితుల ఇళ్ళకు వెళ్ళి పిల్లల చదువు విషయంలో వారిని చైతన్య పరిచారు. గంటలు గంటలు సమయం వెచ్చించి వారికి అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. మహిళలకు విద్య ఆవశ్యకతను వివరించి వారిలో జ్ఞానజ్యోతులు వెలిగించారు. ఆరోజుల్లో సనాతన మనువాదులు మహిళా విద్యను నిర్ద్వందంగా వ్యతిరేకించేవారు. రకరకాలుగా వేధించేవారు. అవమానాలకు, ఛీత్కరింపులకు గురిచేసేవారు. బెదిరింపులకు పాల్పడేవారు. అయినా ఆమె ఏమాత్రం లక్ష్య పెట్టలేదు, లెక్క చేయలేదు.



మదీహా అర్జుమంద్

# చీకట్లను చీల్చిన జ్ఞాన కిరణం ఫాతిమా షేక్

**ప్రాచీన కాలంలో** విద్య సామాన్యులకు అందని ద్రాక్షగా ఉండేది. కేవలం అగ్రకులాల వాళ్ళుమాత్రమే విద్యాభ్యాసం చేయడానికి అర్హులుగా పరిగణించబడేవారు. మిగతా వారెవరూ చదువుకు అర్హులు కారు. శూద్రులు, దళితులు, మహిళలు విద్య నేర్చుకోవడం నేరం, పాపం. సనాతన మతసాంప్రదాయంలో శూద్రులెవరైనా వేదం విన్నా, ఉచ్చరించినా కఠిన శిక్షలు విధించేవారట. అలాంటి అజ్ఞాన కాలంలో విద్యావ్యాప్తికోసం అనేకమంది సంస్కర్తలు కృషిచేశారు. విద్యను సర్వసామాన్యం చెయ్యడానికి అలుపెరుగని ప్రయత్నం చేశారు. అగ్రవర్ణ సమాజం నుండి ఎన్ని అవమానాలు, ఎన్ని బెదిరింపులు, ఎన్ని కష్టనష్టాలు ఎదురైనా మొక్కవోని ధైర్యంతో సమాజ సంస్కరణ కోసం పాటుపడ్డారు. అలాంటి వారిలో ఫాతిమా షేక్ ఒకరు. ఈమె సావిత్రీబాయి స్నేహితురాలు, సహోద్యోగి. భర్త సహకారంతో సావిత్రీబాయి, సోదరుని సహకారంతో ఫాతిమా విద్యార్జన చేశారు. సావిత్రి బాయితో కలిసి జ్యోతీరావు పూలే దగ్గరే ఆమె చదువు నేర్చుకున్నారు. సోదరుడు ఉస్మాన్ షేక్ ప్రోత్సాహంతో ఉన్నత చదువులూ అభ్యసించారు. సోదరుని సహకారంతోనే విద్యావ్యాప్తికి ఎనలేని కృషి చేశారు. పూలే దంపతులు గృహ బహిష్కరణకు గురైనప్పుడు వారికి ఆశ్రయం కల్పించి ఆదుకున్నారు. తమ హవేలీనే పాఠశాల నిర్వహణకోసం పూలే దంపతులకు వితరణగా ఇచ్చి అండగా నిలిచారు. సావిత్రీబాయి పూలేతో కలిసి ఉపాధ్యాయురాలిగా విద్యావ్యాప్తిలో కీలక పాత్ర పోషించారు.

1851లో ఆమె స్వయంగా ముంబైలో రెండు పాఠశాలలు స్థాపించారు. దళితుల ఇళ్ళకు వెళ్ళి పిల్లల చదువు విషయంలో వారిని చైతన్య పరిచారు. గంటలు గంటలు సమయం వెచ్చించి వారికి అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. మహిళలకు విద్య ఆవశ్యకతను వివరించి వారిలో జ్ఞాన జ్యోతులు వెలిగించారు. ఆరోజుల్లో సనాతన మనువాదులు మహిళా విద్యను నిర్ద్వందంగా వ్యతిరేకించేవారు. రకరకాలుగా వేధించేవారు. అవమానాలకు, ఛీత్కరింపులకు గురిచేసేవారు. బెదిరింపులకు పాల్పడేవారు. అయినా ఆమె ఏమాత్రం లక్ష్య పెట్టలేదు, లెక్క చేయలేదు. దుమ్మెత్తి పోసినా, పేడ నీళ్ళు కుమ్మరించినా, రాళ్ళువిసిరినా చలించలేదు. ఈనాడు హరిజన, గిరిజన, మైనారిటీ, బడుగు బలహీన వర్గాల ప్రజలంతా విద్యాపరంగా ముందడుగు వేస్తున్నారంటే, అది ఫాతిమా షేక్, ఉస్మాన్ షేక్, సావిత్రిబాయి, జ్యోతిరావు పూలేల వంటి సంస్కర్తల పుణ్యమే అని గ్రహించాలి. సోదరుడు ఉస్మాన్ షేక్ సహకారంతో సావిత్రిపూలే, జ్యోతిబా పూలే లతో కలసి ఫాతిమా విద్యావ్యాప్తితో పాటు, అనేక సేవా కార్యకలాపాల్లో పాల్గొన్నారు. ఫాతిమా షేక్ గురించి సావిత్రీబాయి పూలే ఇలా రాశారు:' ఫాతిమా నాకు ఎంతగానో సహకరించారు. ఆమె సహకారంతోనే నేను అనేక సేవా కార్యక్రమాలను కొనసాగించగలిగాను' అంటూ ఆమె తన భర్త జ్యోతిబా పూలేకు రాసిన లేఖలలో పేర్కొన్నారు. ఫాతిమా షేక్ సేవా కార్యక్రమాలపై దృష్టి పెట్టినంతగా సాహిత్యంపై పెట్టలేదు. లేకపోతే ఆమె గొప్పసాహిత్యాన్ని సృజించి ఉండేవారని, ఆమెకు సంబంధించిన సమాచారం లభించడంలో అది ఎంతగానో ఉపయోగపడేదని ప్రముఖ చరిత్రకారులు సయ్యద్ నశీర్ అహమ్మద్ అభిప్రాయ పడుతున్నారు. ఇప్పటికే ఆయన ఫాతిమా షేక్‌కు సంబంధించిన సంక్షిప్త సమాచారంతో 73 పేజీల పుస్తకాన్ని వెలువరించారు. సమగ్ర సమాచార సేకరణలో తలమునకలై ఉన్నారు. 2014లో మహారాష్ట్ర ప్రభుత్వం సర్ సయ్యద్ అహ్మద్ ఖాన్, జాకీర్ హుస్సేన్, అబుల్ కలాం ఆజాద్ లాంటి వారితో పాటు ఫాతిమా షేక్ సంక్షిప్త పరిచయాన్ని 'బాల్ భారతి'లో పాఠ్యాంశంగా చేర్చింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా ఫాతిమా షేక్ సేవలను గుర్తించి, 8వ తరగతి పాఠ్యపుస్తకాలలో ఆమె రచనలపై పాఠాన్ని ప్రవేశపెట్టింది. ఆమె కేవలం ముస్లిం సమాజం కోసమే పనిచేయలేదు, సమాజంలో వివక్షకు, అన్యాయానికి, అణచివేతకు, అవిద్యకు గురైన అన్ని వర్గాల ప్రజల కోసమూ ఆమె పాటుపడ్డారు. అగ్రకులాధిపత్యంలో తీవ్ర వివక్షకు గురైన వితంతువుల్లో చైతన్యం తీసుకురావడానికీ ఆమె శక్తివంచనలేని ప్రయత్నం చేశారు. ఎలాంటి అసమానతలూ లేని సమ సమాజాన్ని ఆమె కాంక్షించారు. దేవుని దృష్టిలో అందరూ సమానమే అయినప్పుడు మానవుల మధ్యనే ఈవివక్ష ఎందుకన్నది ఆమె ప్రశ్న. ఇంతటి స్ఫూర్తి ప్రదాత అయిన ఫాతిమా షేక్‌కు సంబంధించిన పూర్తి వివరాలు, ఆమె చేపట్టిన సేవా కార్యక్రమాలు, విద్యావ్యాప్తికోసం ఆమె చేసిన అసామాన్య కృషిని చరిత్రకారులు మరింతగా వెలికి తీసి, వెలుగులోకి తీసుకురావాల్సిన అవసరం ఉంది. ఎందుకంటే, షుమారు 193 సంవత్సరాల క్రితంనాటి అజ్ఞాన సమాజంలో, నాటి ప్రతిబంధకాలన్నిటినీ ఛేదించుకొని సమాజ సంస్కరణకోసం నడుం బిగించడం, లక్ష్యాన్ని ముద్దాడడం సామాన్య విషయం కాదు. ఈకారణంగానే ఆమె 191 వ జయంతి సందర్భంగా గూగుల్ సంస్థ తన హోమ్ పేజీలో డూడుల్‌తో సత్కరించింది. కనుక సావిత్రిబాయి పూలేతో పాటు, ఫాతిమా షేక్‌నూ స్మరించుకోవలసిన అవసరం ఉంది. విపత్కర పరిస్థితుల్లో పూలే దంపతులకు ఆశ్రయం కల్పించి, తమ హవేలీని పాఠశాల నిర్వహణకోసం వితరణగా ఇచ్చి, వారితో భుజం భుజం కలిపి పనిచేసిన ఫాతిమా షేక్ కృషినీ గుర్తించి, సావిత్రిబాయితో సమానంగా గౌరవిస్తూ, పీడిత, తాడిత అణగారిన వర్గాల అభ్యున్నతికోసం ఆమె చేసిన త్యాగాలను స్మరించుకోవలసిన అవసరం ఉంది. ఫాతిమా, సావిత్రి స్ఫూర్తితో బహుజనులంతా కలిసి హక్కుల కోసం సమిష్టి పోరాటాలు చేయవలసిన అవసరమూ ఉంది. ❑

తెలుగు చేతిలో సత్య దీపిక
నిత్య వేదిక

సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక

1

# ఇస్లామీయ ఉద్యమం- దాని క్రమవికాసం

- ఎస్.ఎమ్. మలిక్

**ఉద్యమంలో చేరుతున్న నవతరానికి ప్రత్యేకం**

**ఇస్లామీయ** ఉద్యమం ప్రారంభమయి అర్ధశతాబ్ది దాటి పోయింది. ప్రప్రథములు బహుశా ఇప్పుడు ఎవ్వరూ లేరు. తొలినాటి మహనీయుల నీడలో ఎవరెవరికయితే ప్రయోజనం, శిక్షణ పొందే అవకాశం ప్రాప్తమయిందో వారు కూడా తమ కార్యకలాపాలు ముగించుకుని తమ నిజ జన్మ స్థలానికి పయనమయ్యేందుకు నిరీక్షిస్తున్నారు. జీవన కర్మాగారం ఇలాగే ప్రళయ స్థాపన వరకూ సాగుతూనే ఉంటుంది. జనులు వస్తూ ఉంటారు, బిడారులు నిర్మాణమవుతూ ఉంటాయి, తమ తమ పాత్రలు నిర్వహిస్తూ నిజ ప్రభువు సాన్నిధ్యం కోరుకుంటూ ముందుకు సాగుతూ ఉంటారు. అయితే ఇస్లామీయ ఉద్యమ బిడారు తన ఆనవాళ్లను నిలుపుకుంటూ, వాటిని సజీవంగా కళకళలాడేలా ప్రఫుల్లం చేసుకుంటూ ముందుకు సాగుతూనే ఉంటుంది. ఇలా సాగుతూ ఉండాలన్నది మనందరి ఆకాంక్ష, ఆవేదన, ప్రార్థన.

## నిరంతరత

మన పూర్వీకులు, ప్రథములు, సదా ఓ విషయమయి చింతాగ్రస్తులయి ఉండేవారు. ఈ ఉద్యమం, దాని సైద్ధాంతిక, సందేశాత్మక, నైజ ప్రధానమయిన నిరంతరతను కాపాడు కుంటూ, తన సాంస్కృతిక నిరంతరత❖కు భంగం వాటిల్లకుండా చూసుకుంటూ ఉండాలన్నదే వారి బాధ. ఇది వారికి సహజమే, అవసరం కూడాను. వారు తమ జీవన కాలాన్ని దాని నిర్మాణం లోనూ, దాని పరిరక్షణలోనూ గడిపిన వారు. అందువల్ల అది వారి కర్తవ్యం కూడా. నేడు ఈ ఉద్యమ బిడారులో తోడ్పాటునిస్తున్న మహనీయుల ప్రేమాభిమానాల శ్రీ నీడ, మార్గదర్శకత్వం సుదీర్ఘ కాలం వరకు కొనసాగాలన్న ఆకాంక్షలతో ఈ విన్నపాలు వారికి విన్నవించుకుంటున్నాను. వారు ఈ నిరంతరత, ప్రగతి వికాసం, దాని పురోగమనాన్ని ఓసారి దర్శించగలగాలని. మనందరి ఆవేదన అదొక్కటే కాబట్టి!

నేడు పరిస్థితులు మారిపోయాయి. నవతరం ఈ మహోత్కృష్ట భారాన్ని మోయడానికి ముందుకు వచ్చేసింది. వయసు మీరిన ఉద్యమ పెద్దలు ఉద్యమ మీరాశీని వారికి అప్పగించారు కూడా.

❖ సాంస్కృతిక నిరంతరత అంటే నా దృష్టిలో ఇస్లామీయ ఉద్యమం ముస్లిముల సాంస్కృతిక జీవనిలో చేసిన కొన్ని కొత్త ప్రయోగాలు. ఒక విధానం 'ఇజ్తిమా'ల నిర్వహణ. ఉద్యమం 'ఇజ్తిమా' పరిభాషతో మొదలెట్టి దాని క్రమానుగతి, నిర్వహణ,

ఇప్పుడు ఉద్యమ సైద్ధాంతిక, సాంస్కృతిక మీరాశీని, దాని నిరంతరను, దాని ప్రగతీ వికాసాలను పరిశీలించడం, అవగత పరచుకోవడం, పురోగమింపజేయడం అవసరం.

ఉద్యమం ప్రారంభమయినప్పటి నుండి నేటివరకు, దాని సైద్ధాంతిక, సూత్రప్రధానమయిన స్థాన రక్షణకు ఒక వైపున దాని లిటరేచర్ (సాహిత్యం) ఉండగా మరో వైపున దాని నిబంధనావళి ఉంది. నా దృష్టిలో ఈ రెండు రక్షక కవచాలు, ఉద్యమాన్ని అంతర్గత, బాహ్య ప్రమాదాల నుండి రక్షించడానికి ఇవి చాలావరకు సరిపోతాయి. లిటరేచర్ విషయానికి వస్తే అది ఓ ప్రత్యేక నేపథ్యంలో ఉనికిలోకి వచ్చింది, నేడు పరిస్థితులలో పరివర్తన సంభవించడం మూలాన అందులోని కొన్ని అంశాలు అసంగతంగా లేదా అనుచితంగా అగుపించవచ్చు. కాని నిబంధనావళి దాని ప్రాతిపదిక ప్రత్యేకతల వల్ల ఉద్యమ సిద్ధాంతాల పట్ల నిరంతరంగా కొనసాగే ఊట వంటిది. అందువల్ల నేటి ఈ విన్నపాలు ఈ ఇస్లామీయ ఉద్యమానికి సంఘటనా రూపమయిన జమాఅతె ఇస్లామీ హింద్ నిబంధనావళియే సరయిన భూమిక.

## మూడు ప్రాతిపదికలు

ఈ నిబంధనావళికి భూమికలు లేదా ప్రాతిపదికలు మూడు. విశ్వాసం, ధ్యేయం, ఆచరణా విధానం. నిబంధనావళిలో ఈ మూడు ప్రాతిపదికలు తప్ప మిగతా అంతా సంస్థాగత చట్టాన్ని అందజేస్తుంది. సంస్థాగత చట్టంలో తాత్కాలిక ఆవశ్యకతలు, సంస్థాగత ఔచిత్యాలననుసరించి అనేక సవరణలు చేయడం జరిగింది. మున్ముందు కూడా అలాంటి సవరణలు సాధ్యమే. అయితే ఆ మూడు ప్రాతిపదికలు 3,4,5వ అధికరణలలో ప్రస్తావించబడిన అంశాలు మాత్రం తొలి రోజు నుంచి నేటివరకు ఎటువంటి మార్పులూ చేర్పులకు లోనవలేదు. ఎప్పుడయినా ఏవయినా శాబ్దిక మార్పులు జరిగాయేమో కాని భావంలోనూ నిజసారంలోనూ ఎటువంటి పరివర్తన, వ్యత్యాసం ఏర్పడలేదు. నిబంధనావళిలోని ప్రాతిపదికలు నిజానికి ఉద్యమ ప్రాతిపదికలు. ఉద్యమానికి ఆలోచనాత్మకంగా, సైద్ధాంతికంగా, దాని నైజాన్ని అనుసరించి నిరంతరతకు రక్షక కవచాలు ఈ ప్రాతిపదికలే. కాస్త ఈ ప్రాతిపదికలను వివరంగా పరిశీలిస్తే బోధపడుతుంది, ఈ ప్రాతిపదికలున్నంత కాలం ఇస్లామీయ ఉద్యమం దాని మౌలిక స్థానంతో పటిష్టంగా అతికి ఉంటుందని.

## విశ్వాసం

జమాఅతె ఇస్లామీ నిబంధనావళిలో మూల విశ్వాసం గురించి ఇవ్వబడిన విశదీకరణలు, వివరణలు ఎంతో సమగ్రంగా, సంపూర్ణంగా ఉన్నాయి. నాకు తెలిసినంతవరకు ఇంతకన్నా ఉత్తమ రీతిలో, ప్రస్ఫుటంగా ప్రపంచంలోని మరే ఉద్యమ సాహిత్యంలోనూ కానరాదు. దాదాపు ఈ భావమే ఓ అంతర్జాతీయ ఖ్యాతి గడించిన ధర్మవేత్త రచనలో కానవచ్చింది. ఇటువంటి నిబంధనావళి ఆధారమయిన ఉద్యమంలో కృషి జరపడం మన అదృష్టం అని నేను భావిస్తున్నాను. దైవానికి సహస్రకోటి వందనాలు. మౌలిక విశ్వాసంలోని ఒక్కొక్క పదాన్ని మనం పరిశీలిస్తే తెలుస్తుంది, నిబంధనావళి నిర్మాతలు ఎంతగా పాటుబడి, ఎంత లోతుగా, విస్తృతంగా ఆలోచించి మరీ దీన్ని రూపొందించారో. ఇదే మాటను ఈ నిబంధనావళిలోని ప్రతి అధికరణను గురించి మనం చెప్పగలము కాని మరీ ముఖ్యంగా మొదటి భాగం ఎంత సూక్ష్మ దృష్టితో, దూర దృష్టితో సంకలనం చేయడం జరిగిందో అది అనన్యం. ఇస్లామీయ సముదాయానికి జమాఅత్ అందజేసిన అపూర్వమయిన మీరాశీ ఇది. మౌలిక విశ్వాసాన్ని గురించి నిబంధనావళిలోని ఈ వివరణను ఇస్లామ్ పరిచయం కొరకు జంకుగొంకు లేకుండా సమర్పించవచ్చు.

**(ఇంకా వుంది)**

---

కాలనియతి (Periodicity), ఉదాహరణకు, ప్రతి వారం, నెలసరి, మూడు నెలలకు మొదలయినవి. ఇలా ఓ ప్రత్యేక పోకడను సృష్టించడం. ఇంకా కుర్ఆన్, హదీసుల పాఠ్యా కూటములు, కుర్ఆన్ అవగాహనా కూటములు; ఉద్యమ సాహిత్య అవగాహనకు 'స్టడీ సర్కిళ్లు', ధార్మిక లైబ్రరీలు, సంచార గ్రంథాలయాలు, పోస్టల్ లైబ్రరీలు. పత్రికల్లో ధార్మిక విషయాలపై బహిరంగ చర్చలు, సోదర దేశ వాసులు, సాముదాయిక సోదరుల తోడ్పాటుతో సింపోజియమ్‌ల ఏర్పాటు. అంటే జనసామాన్యంతో పరస్పర సంబంధాలకు సాధ్యమయిన ప్రతి సాధనను వినియోగించడం అన్నమాట. జన సామాన్యాన్ని కలుపుకుని పరస్పర అవగాహనకు మార్గాలు వెదికే ప్రత్యేకత. ఇవన్నీ ఇస్లామీయ ఉద్యమం ద్వారా ప్రాప్తమయినవే. కేవలం ఇజ్తిమాలు, వాటి విభిన్న రూపాలే కాక, సాముదాయిక, ధార్మిక కార్యకలాపాలను సంఘటితంగా, సామూహికంగా నిర్వహించే సంప్రదాయాన్ని కూడా ఇస్లామీయ ఉద్యమమే సర్వసాధారణం చేసింది. మరీ ముఖ్యంగా సాముదాయిక సమస్యల విషయంలో సామూహిక స్పృహను జాగృతం చేసి కలసిమెలసి పనిచేసే విధానాన్ని ప్రచులితం చేయడంలోనూ ఉద్యమ కృషికే ప్రాముఖ్యత, ప్రాధాన్యతలున్నాయి. ఇలా అనేక విషయాలకు ఆద్యం కూడా ఇస్లామీయ ఉద్యమంలోనే కానవస్తుంది. ఇవన్నీ ఇస్లామీయ ఉద్యమానికి చెందిన సాంస్కృతిక వారసత్వంలో చేరి ఉన్న అంశాలే. వీటన్నింటినీ సమగ్రంగా సంపూర్ణంగా దర్శించాలంటే ఓ పరిశోధనా కృషి ద్వారానే సాధ్యం.

# 9 విషయాలు

- నసీరా బేగం

**నా ప్రభువు నాకు తొమ్మిది విషయాలను గురించి ఆజ్ఞాపించాడు అని దైవప్రవక్త(స) సెలవిచ్చారు:** 1) ఏకాంతంలో ఉన్నా, నలుగురిలో ఉన్నా అల్లాహ్‌కు భయపడుతూ ఉండాలి 2) కోపంలో ఉన్నా సంతోషంలో ఉన్నా న్యాయంగా వ్యవహరించాలి 3) ఐశ్వర్యంలో ఉన్నా పేదరికంలో ఉన్నా మితంగా ఉండాలి 4) ఎవరైనా నీతో తెగదెంపులు చేసుకుంటే వారితో స్నేహ హస్తాన్ని చాపాలి 5) ఎవరైతే నాకు ఇవ్వరో నేను వారికి ఇవ్వాలి 6) మౌనంగా ఉన్నప్పుడు చింతన చెయ్యాలి 7) నీ చూపు ద్వారా గుణపాఠం నేర్చుకోవాలి 8) ఎవరైనా నీ మీద దౌర్జన్యం చేస్తే వారిని క్షమించాలి 9) మంచిని ఆదేశించాలి, చెడును త్రుంచాలి. (మిష్కాత్)

దైవప్రవక్త(స) గారి ఈ సూక్తిలో మూడు అంశాల గురించి చెప్పబడింది 1) దాసునికి దేవునితో ఉండే సంబంధం గురించి 2) ప్రజల పరస్పర సంబంధాల గురించి 3) మనిషికి తనతో తనకి ఉండే సంబంధం గురించి.

1) మనిషి అల్లాహ్‌ను విశ్వసించిన తరువాత అతని జీవితం చక్కదిద్దుకోవటానికి, అతనికి ఉన్నత శిఖరాలపై చేర్చటా నికి కావలసిన ముఖ్యమైన గుణం దైవభీతి. ఈ దైవభయమే మనిషి ఏకాంతంలో ఉన్నప్పుడు కూడా అతన్ని కాపాడుతుంది. మనిషికి చట్ట భయం పోలీసుల దృష్టిలో పడినప్పుడే కలుగు తుంది. నేరాలను చేసి కూడా మనిషి పోలీసుల కళ్ళు గప్పి, చట్టాన్ని తారుమారు చేసి కూడా తప్పించుకోగలుగుతాడు. కాని మనిషి చట్టాన్ని అనుసరించటానికి కూడా గోప్యమైన శక్తి భయం అతనికి తప్పకుండా ఉండాలి. ఆ భయం అల్లాహ్ భయమే అవగలుగు తుంది. అల్లాహ్ సర్వాంతర్యామి, సర్వసృష్టికర్త, అన్నివేళల్లో, అన్ని చోట్ల అతన్ని చూడగలుగుతాడు. పట్టుకో గలుగుతాడు. శిక్షను కూడా ఇవ్వగల శక్తి సామర్థ్యాలు కలవాడు. ఆయన్ని తప్పించుకోవటం ఎవరి తరమూ కాదు. ఈ దైవభయం అనేది కేవలం నేరం చేసినవాళ్ళలోనే ఉండటం కాదు. విశ్వాసుల్లో ఆ దైవభయం మరింత అధికంగానే ఉంటుంది.

ఒకసారి దైవప్రవక్త(స) గారితో హ॥జత్ ఆయిషా(ర) ఖుర్‌ఆన్ గ్రంథంలోని ఈ వాక్యం గురించి 'ఎవరు తమ ప్రభువు భయం వల్ల భయపడుతూ ఉంటారో' (23: 60) ఇలా అడిగారు. ఓ దైవప్రవక్తా(స)! ఈ భయపడేవారు అంటే మద్యం తాగేవారా? జూదం ఆడేవారా అని. దానికి సమాధానంగా ఆయన(స) "ఓ సిద్దీఖ్ కుమార్తె! కాదు, ఈ వాక్యంలో ప్రస్తావించింది విశ్వాసుల గురించి. వారు ఉపవాసాలను పాటిస్తారు, నమాజులు చేస్తారు, దానధర్మాలు చేస్తారు. ఆ తరువాత వారు తమ ఈ ఆరాధనలు స్వీకరించబడతాయో లేదో అని భయపడుతూ ఉంటారు. ఇలాంటి వారే అత్యధికంగా సత్కార్యాల వైపునకు పరుగులు పెడతారు." (తిర్మిజీ)

ఈ దైవభయం ద్వారా మనిషికి ఎన్నో లాభాలు లభిస్తాయి. దైవ భయం అనే ఆచరణ అల్లాహ్‌కు అత్యంత ప్రియమైనది. దైవ భయంతో ఏడ్చేవాడు నరకాగ్ని నుంచి రక్షించబడతాడు. దైవప్రవక్త(స) ఇలా సెలవిచ్చారు; దైవభయంతో విలపించేవాడు, నరకంలో ఎంతమాత్రం ప్రవేశించడు. ఏ విధంగానైతే పితికిన పాలు తిరిగి పాదులలో ఎంతమాత్రం ప్రవేశించవో.

పాపకార్యాలు మనిషిని నరకాగ్నిలో పడవేస్తాయి. కాని పాప కార్యాలను క్షమించమని వేడుకోవటం ద్వారా మనిషి స్థానాలు ఉన్నతం అవుతాయి. అల్లాహ్ భయం వల్ల ఏ వ్యక్తి రోమాలైతే నిక్కబొడుచుకుంటాయో అతని పాపాలు ఎండిపోయిన చెట్టు కొమ్మల ఆకులు రాలిపోయినట్లుగా అతని నుంచి రాలిపోతాయి. ఈ విధంగా అల్లాహ్ అతనిని పరిశుభ్రపరుస్తాడు.

2) కోపంలో ఉన్నా సంతోషంలోఉన్నా న్యాయంగా వ్యవహరించండి. సాధారణంగా మనిషిలో ఉండే స్వభావం ఏమిటంటే అతని ఇష్టానికి వ్యతిరేకంగా ఏదైనా కార్యం జరిగినప్పుడు అతనికి కోపం వస్తుంది. ఇది అతని నైజంలోనే ఉంటుంది. ఈ సూక్తిలో మనిషికి ఎప్పుడు ఏ పరిస్థితిలోను కోపం రాకూడదు అని చెప్పటం

జరగలేదు. అతని నైజంలో ఉన్న విషయాన్ని ఎవరూ ఆపలేరు. కాని అతనికి కోపం వచ్చినప్పుడు అడ్డూఅదుపు లేకుండా ప్రవర్తించ కూడదు. సాధారణంగా చూసే విషయం ఏమిటంటే మనిషికి కోపం కలిగినప్పుడు ఆగ్రహోదగ్రుడవుతాడు. అదుపును కోల్పోయి విచక్షణా రహితంగా ప్రవర్తిస్తాడు. ఆ సమయంలో అతను తనను తాను కూడా నష్టపరచుకుంటాడు. ఎదుటివారిని కూడా నష్టపరుస్తాడు. మనిషి కోపంలో ఉన్నప్పుడు షైతాన్ అతనిపై ప్రాబల్యం వహిస్తాడు. చెయ్యరాని పనులు కూడా చేయిస్తాడు. చివరకు అతని ఇహపర లోకాలు రెండింటినీ నష్టపరచుకుంటాడు.

కోపంపై అదుపును సాధించే మనిషి అంటే అల్లాహ్‌కు ఎంతో ఇష్టం. అల్లాహ్ అలాంటి వ్యక్తిని ఇష్టపడతాడు. అతనిని క్షమిస్తాడు. ఇంకా అతన్ని స్వర్గంలో ప్రవేశింపజేస్తాడు అని తెలియజేయడం జరిగింది. కోపంపై అదుపును సాధించటం చాలా కష్టతరమైన పని. కనుకనే దైవప్రవక్త(స) ఇలా సెలవిచ్చారు; కుస్తీ పోటీల్లో పాల్గొని నెగ్గిన వారు పహిల్వాను కారు. ఎవడైతే కోపం వచ్చినప్పుడు దానిపై అదుపును సాధించినవాడే అసలు పహిల్వాన్ అన్నారు.

మనిషి తన కోపంపై అదుపును సాధించి అలాంటి పరిస్థితిలో కూడా న్యాయంగా వ్యవహరించు అని బోధించటం జరిగింది. అన్యాయాన్ని గాడాంధకారంతో పోల్చటం జరిగింది. కనుక మనిషి సంతోషంలోను, కోపంలోను, వ్యవహారం తనవారికి సంబంధించిన దైనా లేదా వేరే ఎవరికో సంబంధించినది అయినా అన్ని పరిస్థితుల్లో న్యాయంగానే వ్యవహరించాలి. ఒకవేళ అన్యాయాన్ని, దౌర్జన్యాన్ని తలపెడితే తప్పకుండా శిక్ష అనుభవించవలసి ఉంటుంది.

3) ఐశ్వర్యంలో ఉన్నా, పేదరికంలో ఉన్నా మితంగా ఉండండి అని బోధించటం జరిగింది. మనిషిలో మితవైఖరి గనక ఉన్నట్లయితే అతను ఒక పెద్ద ధనవంతుడు అని చెప్పవచ్చు. ఇది కేవలం డబ్బు విషయంలోనే కాదు. అన్ని వ్యవహారాలలో గనక మనిషి మితవైఖరిని అవలంబిస్తే అతను ఎల్లవేళలా సుఖంగా, సంతోషంగా జీవించగలుగుతాడు. అతనికి ఐశ్వర్యమూ ముంచదు, పేదరికమూ ముంచదు. దూరదృష్టి, నిలకడ అనే గుణాలతో అతను ఎల్లప్పుడూ కళకళలాడుతూ ఉంటాడు. అతను అతిగానూ ఖర్చుపెట్టడు. అలా అని తనచేతులను బంధించి ఉంచడు. వృధా ఖర్చు చేసేవాడు షైతాన్ సోదరుడనీ, పిసినారి స్వర్గంలో ప్రవేశింపజాలడని బోధించటం జరిగింది.

4) ఎవరైనా నీతో తెగదెంపులు చేసుకుంటే నీవు వారికి స్నేహ హస్తాన్ని చాపాలని. మనిషి జీవితంలో ఎంతో మందితో వారు సొంతవారైనా కావచ్చు, బయటివారైనా కావచ్చు సంబంధాలు ఏర్పడతాయి. వ్యవహారాలు సాగుతాయి. అటువంటప్పుడు ఆటుపోట్లు, తప్పిదాలు, పొరపాట్లు జరుగుతూ ఉంటాయి. సాధారణంగా చాలాసార్లు ఇద్దరి మధ్య పొరపొచ్చాలు ఏర్పడ తాయి. అనుమానాలు, అపార్థాలు ఏర్పడతాయి. అటువంట ప్పుడు ఇద్దరిమధ్య అడ్డుగోడలు నిలబడిపోతాయి. ఇద్దరి మధ్య మాటామంతీ తగ్గిపోతుంది. ఏళ్ళ తరబడి మాట్లాడు కోవటం మానివేస్తారు. రాకపోకలు ఆపివేస్తారు. ఈ విధంగా ఇద్దరి మధ్య తెగదెంపులు జరిగిపోతాయి. కనుక ఒకరిని మరొకరు క్షమించి, చర్చించి, మన్నించి స్నేహ సంబంధాలు కొనసాగించమని ఇస్లామ్ బోధిస్తుంది. ఎవరైతే ముందుకు వచ్చి మొదట స్నేహ హస్తాన్ని చాపుతారో వారికి అధిక పుణ్యం లభిస్తుందని బోధిస్తుంది. ఇంకా మూడు రోజులకంటే అధికంగా మాట్లాడుకోకుండా ఉండ కూడదని కూడా తెలియజేస్తుంది. ఎవరైతే రక్త సంబంధా లను త్రెంచుకుంటారో వారితో అల్లాహ్ సంబంధం కూడా తెగిపోతుం దని హెచ్చరించటం కూడా జరిగింది.ఎందుకంటే ఒకవేళ ఇద్దరి మధ్య తెగదెంపులు జరిగితే అది అక్కడివరకే ఆగిపోదు. ఆ తరువాత కక్షలు, కార్పణ్యాలు, హత్యలు, ఆత్మహత్యలు కూడా జరుగుతాయి. కనుకనే ఈ ఘోర నష్టాలనుంచి కాపాడడానికే ఇవన్నీ బోధించారు.

5) ఎవరైతే నాకు ఇవ్వరో నేను వారికి ఇవ్వాలని. ఈ విషయం కూడా దాదాపు పై విషయంతో సంబంధం కలదే. సాధారణంగా ఇచ్చిపుచ్చుకోవడాలు జరుగుతూనే ఉంటాయి. కాని ఎవరైతే తనకు ఇస్తారో వారికే తిరిగి ఇస్తారు. ఇవ్వని వారికి ఇవ్వరు. ఇచ్చిన వారికి తిరిగి ఇవ్వడంలో పెద్ద విషయమేముంది. ఇవ్వని వాడికి ఇవ్వడం గొప్ప విషయం. దానికి పెద్ద మనసు ఉండాలి. ఒకడుగు ముందుకు వేయాలి. ఇవ్వనివాడికి ఇచ్చినట్లయితే ఒక గొప్ప అలవాటును అతనికి నేర్పినట్లు అవుతుంది. అతనితో స్నేహ సంబంధాలు మొదలవ్వటానికి, స్థిరంగా ఉండటానికి పనికొస్తుంది.

6) మౌనంగా ఉన్నప్పుడు చింతన చెయ్యమని. సాధారణంగా చాలామంది అవసరమున్నా లేకపోయినా మాట్లాడుతూనే ఉంటారు. కాని అనవసరంగా మాట్లాడితే ఆ మాటలు అనర్థాలు తెచ్చిపెడతాయి. కనుక అవసరం అయినప్పుడు మాట్లాడి అవసరం లేనప్పుడు మౌనంగా ఉండి ఆలోచించి తన జీవిత లక్ష్యాన్ని తెలుసుకోవాలి. దైవాజ్ఞలను తెలుసుకోవాలి. దైవ గ్రంథాన్ని, ఇతర పుస్తకాలను చదవాలి. అప్పుడే మనిషి సరైన

సవ్యమైన మార్గాన్ని తెలుసుకుంటాడు. ఆచరించి స్వర్గాన్ని కైవసం చేసుకుంటాడు. చాలామంది మౌనంగా ఉన్నప్పుడు ఏమీ ఆలోచించకుండా అలాగే ఉండిపోతారు. ఈ అలవాటు ద్వారా జీవిత ఘడియలను వృథా చేసుకుంటారు. లేదా అనవసరమైన విషయాలను ఆలోచించుకుని మానసిక క్షోభను అనుభవిస్తారు. కనుక మౌన సమయాన్ని కూడా చక్కగా వినియోగించుకోవాలి.

7) నీ చూపు ద్వారా గుణపాఠం నేర్చుకోవాలని. అల్లాహ్ మనకిచ్చిన చూపు శక్తి ఎంతో విలువైనది. దాని విలువ చూపు లేని వారిని అడిగి తెలుసుకోవచ్చు. కనుక ఈ చూపు ద్వారా అనవసరమైన ఎలాంటి గుణపాఠం నేర్పని, విచ్చలవిడితనాన్ని నేర్పే విషయాలను చూస్తూ గడపకూడదు. ప్రళయదినం నాడు కళ్ళను ప్రశ్నించటం జరుగుతుంది. చెడు విషయాలను గనక చూసినట్లయితే మనం మన కళ్ళపై దౌర్జన్యం చేసినట్లు అవుతుంది అని అల్లాహ్ సమక్షంలో మనకు వ్యతిరేకంగా ఫిర్యాదు చేస్తాయి. మన చుట్టూ గుణపాఠం నేర్చుకునే ఎన్నో విషయాలు మనకు తారసపడుతూ ఉంటాయి. వాటిపై దృష్టిసారించాలి. జ్ఞానాన్ని నేర్చుకోవాలి. గుణపాఠ దృష్టి మనిషికి కృతజ్ఞతా పూర్వకమైన హృదయాన్ని కలుగజేస్తుంది.

8) ఎవరైనా మీ మీద దౌర్జన్యం చేస్తే క్షమించాలి. సాధారణంగా జరిగే విషయమేమిటంటే, ఎవరిపైనైనా దౌర్జన్యం జరిగితే అతను దాని ప్రతీకారం తీసుకోవటానికి సన్నద్ధమవుతాడు. ప్రతీకారం తీసుకునే హక్కును అల్లాహ్ కల్పించాడు. కాని సమానమైన ప్రతీకారం తీసుకోవాలి. లేకపోయినట్లయితే అధికమైన ప్రతీకారానికి బదులు శిక్ష ఉంటుంది. కాని మనిషి ప్రతీకారం తీసుకునేటప్పుడు కోపంతో రగిలిపోతూ ఉంటాడు. దాని కారణంగా అతను ఇంకా దౌర్జన్యానికి పాల్పడే అవకాశం ఉంది. కనుక అల్లాహ్ క్షమించమని బోధించాడు. ఎవరైతే క్షమిస్తాడో అల్లాహ్ అతన్ని క్షమిస్తాడు. ఇంకా వారిద్దరి మధ్య సత్సంబంధాలు పునరుద్ధమయ్యే అవకాశం కూడా ఉంది.

9) మంచిని ఆదేశించాలి. చెడును త్రుంచాలి. మంచీ చెడు ప్రతి మనిషిలోను, ప్రతి సమాజంలోనూ ఉంటుంది. మంచిని పెంచటం, చెడును త్రుంచటం ప్రతి మనిషి కర్తవ్యం. దానిని అతను తప్పకుండా నిర్వర్తించాలి. ఎందుకంటే ఒకవేళ చెడును చూసి ఊరుకున్నట్లయితే ఆ చెడు సమాజమంతా వ్యాపించిపోయి ఆ సమాజంలో ఊపిరి తీసుకునే అవకాశం కూడా లేకుండా పోతుంది. కనుక ప్రతి ఒక్కరూ చెడును అత్యంత వివేకంతో మొక్కలోనే త్రుంచివేసే కార్యాన్ని చేపట్టాలి. దానితోపాటు మంచిని పెంచే కార్యక్రమాలు చేస్తూ ఉండాలి.

❖

# ఎవరదీ..?

**కరీముల్లా**

1) చద్దర్లో దాచుకున్న
మొనదేలిన కంకుల్ని వసారాలో చల్లి
వాలిన పక్షుల కనుకొసల్లోని
జీవభాషనేరి మురిసిపోతున్న
ఆ వీరుని నవ్వుపై
విసుర్రాయి విసురుతుందెవరదీ?

2) పాలస్తీనా పర్వత సానువుల్లోని
స్వేచ్ఛా సుమాల మకరందాన్ని
ఆఘ్రాణిస్తున్న సప్తవర్ణాల రెక్కల్ని
తుదికంటా విరిచెయ్యాలని చూసే
ఆ అదృశ్య విలయ హస్తమెవరదీ?:

3) పరుగులు తీసే గాలికీ
వింజామరై ఊగే చెట్టు కొమ్మకూ
కురవాలని కురిసే తొలకరి మబ్బుకూ
లోహ సంకెళ్ళు తొడగాలనుకునే
ఆ నిబిడాంధకార
అజ్ఞాన స్వరమెవరదీ?

4) తూర్పు పడమరల్ని కలిపి
ఉత్తర దక్షిణాలన్నీ కలియతిరిగి
వేయి వెలుగుల్ని నింపుకున్న
తాత్విక స్వప్నాన్ని
భయం కీకారణ్యంలోకి గిరాటేసే
ఆ నరహంతక పాదముద్ర ఎవరదీ?

5) అహంకారీ!
ప్రేమించడం గొప్పకళ
ద్వేషం మనసుపై కప్పుకున్న విషవల
జీవితమంటే అర్థం జీవించనీయడం
అందరికీ జీవితం పంచడం.



- జుబేదా బేగం

# తేనెటీగ ఆదర్శం!

“**దైవ విశ్వాసి తేనెటీగ లాంటి వాడు.** తేనెటీగ స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన వాటినే తింటుంది. పరిశుభ్రమైన వాటిపైనే వాలుతుంది. ఎక్కడ వాలినా ఆ పరిసరాలను పాడుచేయదు.'' అని ముహమ్మద్ ప్రవక్త సగటు ముస్లిమ్ ఎలా ఉండాలో ఈ సూక్తిలో వివరించారు. తేనెటీగ స్వచ్ఛమైన పువ్వులనుండి మాత్రమే మకరందాన్ని స్వీకరిస్తుంది. ఇతర కీటకాల మాదిరిగా ఎక్కడ పడితే అక్కడ వాలదు. దుర్గంధాన్ని వ్యాప్తి చేయదు. పుష్పాల నుండి సేకరించిన దానిని ఒకచోట పోగు చేస్తుంది. స్వచ్ఛమైన తేనె ఆరోగ్యానికి ఎంతో మంచిది. ఏ పూల తోటలోకి వెళ్లినా, తాను కూర్చున్న పుష్పాలను ఏ కొంచెమూ నలగనీయదు, వాటికి హాని కలగించడమూ చేయదు. అతి సుకుమారంగా తన పని పూర్తిచేసుకుంటుంది. అదే విధంగా దైవ విశ్వాసి కూడా స్వచ్ఛమైన, పరిశుద్ధమైన మార్గాల ద్వారానే సంపదను అర్జించాలి, ఒకరి హక్కులను హరించి గానీ, అక్రమార్గజనకు పాల్పడి గానీ తన అవసరాలు తీర్చుకోరాదు. తేనెటీగలు ఎంతో కష్టపడతాయి. మకరందాన్ని సేకరించేందుకు సుదూర ప్రాంతాలకు వెళ్లతాయి. ఒకరి కష్టార్జితం మీద ఆధారపడవు. దైవ విశ్వాసి కూడా స్వహస్తాలతో పని చేయాలి. సోమరితనాన్ని దరిచేరనీయరాదు. ఎవరికీ భారం కాకూడదు. ఇతరుల దయా దాక్షిణ్యాలమీద ఆధారపడకూడదన్నది తేనెటీగ ద్వారా నేర్చుకోవచ్చు. తేనెటీగలా సగటు ముస్లిమ్ కూడా పవిత్రమైన, పరిశుద్ధ ప్రదేశాల్లోనే ఉండాలి. చెడులు జరుగుతున్న ప్రాంతాలకు దూరంగా ఉండాలి. తేనెటీగ అందించే మకరందం ఈ సృష్టిలోనే తియ్యనైనది. అలానే దైవ విశ్వాసి కూడా తన నోటి ద్వారా తియ్యని మాటలే పలకాలి. మృధుమధురంగా మాట్లాడాలి. మాటల్లో, చేతల్లో కాఠిన్యాన్ని ప్రదర్శించకూడదు. దైవ విశ్వాసి తన వ్యవహారాల్లో సున్నితంగా ఉండాలి. ఇతరులకు హాని కలిగించకూడదు. తేనెటీగలా దైవ విశ్వాసి కూడా ఇతరులకు ప్రయోజనం కలిగించాలి. ''పక్షుల మధ్య ఉన్న తేనెటీగలా జీవించండి. ప్రతీ పక్షి తేనెటీగను చాలా హీనంగా చూస్తుంది. తేనెటీగ కడుపులో మకరందం ఉన్న విషయం ఆ పక్షులకు తెలిస్తే అవి అలా ఆలోచించవు. దైవ విశ్వాసి కూడా ఎలాంటి వ్యక్తుల మధ్య ఉన్నా తన విశిష్టతను కోల్పోకూడదు'' అని హజ్రత్ అలీ అన్నారు. తేనెటీగలు పువ్వులపై వాలి మకరందాన్ని సేకరిస్తాయి. తిరిగి మనుషులకు తియ్యనైన మకరందాన్ని అందిస్తాయి. అలానే విశ్వాసి కూడా మంచిని సేకరించాలి. మంచిని వ్యాప్తి చేయాలి.

వ్యక్తి సంస్కార, సంఘ నిర్మాణ
నైతిక పథకం
సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక




## నాన్ వెజ్‌లో నాగాలాండ్ టాప్

ప్రపంచ వ్యాప్తంగా శాకాహార వంటకాలను ఆరగించే వారి సంఖ్య భారత్‌లోనే అధికంగా ఉంది. అదే సమయంలో దేశంలో 85 శాతం మంది మాంసాహారాన్ని భుజించే వారున్నారని ఒక సర్వే వెల్లడించింది. అయితే మన దేశంలో ముక్క లేకపోతే ముద్ద దిగని రాష్ట్ర ప్రజలు ఎవరంటే నాగాలాండ్ ముందు వరుసలో నిలుస్తుంది. దేశంలోనే అత్యధికంగా ఇక్కడ మాంసాన్ని వినియోగిస్తారు. ఇక్కడి నివసించే వారిలో 99.8 శాతం మంది మాంసాహారాన్ని ఆరగిస్తారని ఆ సర్వే తెలియజేసింది. తర్వాతి స్థానాల్లో పశ్చిమ బెంగాల్ (99.3 శాతం), కేరళ (99.1 శాతం), ఆంధ్రప్రదేశ్ (98.25 శాతం) ఉన్నాయి.

## ఆగని రూపాయి పతనం

ప్రపంచ మార్కెట్‌లో రూపాయి విలువ మరింత పడిపోవచ్చని అంచనాలు వెలుపడుతున్నాయి. గడిచిన ఐదేండ్లలో 20 శాతం పతనం కాగా.. వచ్చే ఐదేళ్లలోనూ ఇదే స్థాయిలో క్షీణించవచ్చని అంచనా. అంతర్జాతీయ ద్రవ్య మార్కెట్‌లో డాలర్‌తో రూపాయి మారకం విలువ అమాంతం పడిపోవడంతో దేశ ఆర్థిక వ్యవస్థపై ప్రతికూల ప్రభావం పడనుంది. గత వారం డాలర్‌తో పోలిస్తే భారత రూపాయి విలువ రూ.85 దిగువకు పడిపోయింది. ఇది రూపాయి చరిత్రలోనే అత్యంత కనిష్ట విలువ. 2030 నాటికి అంతర్జాతీయ ద్రవ్య మార్కెట్‌లో డాలర్‌తో రూపాయి మారకం విలువ 100కు పడిపోవచ్చని దిక్వింట్ ఓ కథనంలో వెల్లడించింది. 2019లో డాలర్‌తో రూపాయి విలువ 70గా ఉంది. గడిచిన ఐదేండ్లలో 20 శాతం పతనమై 85కు దిగజారింది. వచ్చే ఐదేళ్లలోనే మరో 20 శాతం పడిపోయే అవకాశాలున్నాయని అంచనాలు వెలుపడుతున్నాయి. 2029 డిసెంబర్ నాటికి 100కు దిగువకు పతనం కావొచ్చని అంచనా. 2025 డిసెంబర్ నాటికి 87-88 మధ్య ఉండొచ్చని.. 2027 నాటికి రూ.95కు క్షీణించొచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు. 2029 నాటికి మూడో సారి మోడీ ప్రభుత్వ పదవీ కాలం పూర్తి కానుంది. డాలర్‌తో రూపాయి మారకం విలువ బలహీనంగా ఉండటంతో ఇప్పటికే వాణిజ్య లోటు అమాంతం పెరుగుతోంది.

## ఫిబ్రవరిలో కేంద్ర బడ్జెట్




పార్లమెంట్‌లో కేంద్ర ప్రభుత్వం 2025 బడ్జెట్ ప్రవేశపెట్టనున్నది. బడ్జెట్‌కు సంబంధించి అభిప్రాయాలు, సూచనలను స్వీకరించేందుకు ప్రధాని నరేంద్ర మోదీ ఆర్థికవేత్తలు, నిపుణులతో సమావేశమయ్యారు. ఫిబ్రవరి 1న లోక్‌సభలో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ 2025-26 బడ్జెట్‌ను పార్లమెంట్‌లో ప్రవేశపెడుతారు. ఈ సమావేశంలో సీతారామన్, నీతి ఆయోగ్ వైస్ చైర్మన్ సుమన్ బేరీ, నీతి ఆయోగ్ సీఈవో బీవీఆర్ సుబ్రహ్మణ్యం, ముఖ్య ఆర్థిక సలహాదారు అనంత నాగేశ్వరన్, సుర్జిత్ భల్లా, డీకే జోషి సహా ప్రముఖ ఆర్థికవేత్తలు సమావేశానికి హాజరయ్యారు.

## కూతురికి ఆస్తి హక్కు.. ఖుర్ఆన్ వాక్యం చదివి తీర్పు చెప్పిన జడ్జి

ఆడ పిల్లలకూ తండ్రి ఆస్తిలో వాటా అన్నది ఖుర్ఆన్ గ్రంథం ప్రసాదించిన హక్కు. కానీ చాలా ముస్లిమ్ కుటుంబాల్లో అమ్మాయిలకు ఆస్తిలో వాటా ఇవ్వడానికి నిరాకరిస్తారు. అందుకు కారణమూ లేకపోలేదు. లక్షలకు లక్షలు కట్నకానుకలు సమర్పించుకున్నాము కాబట్టి ఆస్తిలో వాటా ఇవ్వమని తెగేసి చెబుతారు. ఉన్న ఆస్తిని మాత్రం కొడుకులకు సరిసమానంగా పంచిపెడతారు. చాలామంది అమ్మాయిలు మాత్రం తమకు రావాల్సిన ఆస్తి హక్కుకోసం న్యాయపోరాటాల ద్వారా సాధిస్తారు. అలాంటి ఘటనే కశ్మీరులో జరిగింది. తమకు దక్కాల్సిన ఆస్తిహక్కు కోసం నాలుగు దశాబ్దాలు న్యాయ పోరాటం తరువాత కోర్టు ద్వారా దక్కించుకున్నారు. ఈ నలభై ఏళ్ల కాలంలో సోదరి కన్నుమూయడంతో ఆ ఆస్తికి ఆమె కొడుకు న్యాయపోరాటాన్ని కొనసాగించాడు. చివరాఖరకు కోర్టు తీర్పుతో ఆస్తిలో వాటా దక్కింది. కూతురికి ఆస్తిలో వాటా గురించి ఉన్న ఖుర్ఆన్ వాక్యాన్ని వినిపించి తన తీర్పును వెల్లడించారు జడ్జిగారు. పిల్లలను చిన్నప్పటి నుంచి ఖుర్ఆన్‌కు అనుగుణంగా తీర్చిదిద్దితే ఆస్తుల వివాదాలుండవు. కోర్టుల చుట్టూ తిరగాల్సిన అగత్యమూ ఉండదు మరి.




## గాజాలో కాల్పులు విరమించాలి 193 సభ్యులకు గాను 158 మంది మద్దతు

గాజాలో తక్షణమే కాల్పుల విరమణ పాటించాలని ఐరాస జనరల్ అసెంబ్లీ డిమాండ్ చేసింది. ఇందుకు సంబంధించిన తీర్మానాన్ని జనరల్ అసెంబ్లీలో డిసెంబరు 25న ప్రవేశపెట్టగా మొత్తం 193 సభ్యులకు గాను 158 మంది దీనికి మద్దతు తెలిపారు. తొమ్మిది మంది వ్యతిరేకించగా, 13 మంది ఓటింగ్‌కు దూరంగా ఉన్నారు.

## దుబాయ్‌లో ఎయిర్ కండిషన్డ్ వాక్‌వేలు

ఎడారి నగరం దుబాయ్‌లో ఉక్కపోత నుంచి పాదచారులకు త్వరలోనే ఉపశమనం కలగనుంది. త్వరలోనే ఎయిర్ కండిషన్డ్ నడక మార్గాలు అందుబాటులోకి రాబోతున్నాయి. నగరవ్యాప్తంగా ఈ ఫుట్‌పాత్‌లు ఏర్పాటు కానున్నాయి. దుబాయ్ వాక్' పేరుతో చేపడుతున్న ఈ ప్రాజెక్ట్‌లో మొత్తం 6,500 కిలోమీటర్ల పరిధిలో ఈ వాక్‌వేలు అందుబాటులోకి రానున్నాయి. ఇందులో ఏడాది పొడవునా ప్రజలు నడిచేందుకు వీలుగా ఎయిర్‌కండిషనింగ్ ఉంటుంది.

## ఇది యుద్ధం కాదు క్రూరత్వం': గాజా పిల్లలపై ఇజ్రాయెల్ బాంబు దాడిపై పోప్

గాజా ఆస్పత్రులపై జరుగుతున్న బాంబు దాడులను గురించి ఆలోచించాలని పోప్ ఫ్రాన్సిస్ ఈ సందర్భంగా క్రైస్తవులను కోరారు. గాజాలో ఇజ్రాయిల్ సాగిస్తున్న సైనిక దాడులను పోప్ తీవ్రంగా విమర్శించారు. అక్కడ జరుగుతుంది యుద్ధం కాదు మారణ హోమమని ఆందోళన వెలిబుచ్చారు. ఇజ్రాయిల్ చర్యను క్రూరత్వంగా ఆయన గత వారం అభివర్ణించారు. హమాస్ చేతిలో బందీలుగా ఉన్న మిగిలిన ఇజ్రాయిలీలను విడుదల చేయడం కోసం ఇజ్రాయిల్-హమాస్‌లు కాల్పుల విరమణ పాటించాలని కోరారు. గాజాలో పరిస్థితులు దారుణంగా ఉన్నాయని అంటూ చర్చలు, శాంతి స్థాపనకు మార్గం సుగమం చేయాలని పోప్ సూచించారు.

## పెరిగిన మానవ అక్రమ రవాణా




అంతర్జాతీయంగా మానవుల అక్రమ రవాణా పెరిగిందని ఐక్యరాజ్య సమితి సంస్థ యుఎన్ఓడిసి పేర్కొంది. ఈ మేరకు ఒక నివేదికను వెలువరించింది. 2019లో కరోనా ముందు నాటి స్థాయితో పోల్చితే 2022లో ఈ అక్రమ రవాణా బాధితుల సంఖ్య 25శాతం మేర పెరిగిందని పేర్కొంది. వ్యక్తుల అక్రమ రవాణాపై 2024 గ్లోబల్ రిపోర్ట్‌ను మాదకద్రవ్యాలు, నేరాలపై ఐక్యరాజ్య సమితి కార్యాలయం (యుఎన్ఓడిసి) ప్రచురించింది. ఇందుకు దారిద్ర్యం, ఘర్షణలు, వాతావరణ విపత్తులు వంటి అంశాలను కారణాలుగా చూపింది. వీటివల్ల ప్రజలు దోపిడీకి గురి కావడానికి అవకాశాలు పెరిగాయని పేర్కొంది. బాలల రవాణా, బలవంతంగా కార్మికులను తరలించడం, అలాగే బలవంతంగా నేరాలు చేయించడం వంటి అంశాలు కూడా ఇదే కాలంలో పెరిగాయని ఆ నివేదిక పేర్కొంది. అంతర్జాతీయంగా చూసినట్లైతే వెట్టి చాకిరి కోసం తరలించే బాధితుల సంఖ్య 2019తో పోలిస్తే 2022లో 47 శాతం పెరిగింది. బాలల బాధితుల సంఖ్య 31 శాతం పెరిగింది. ఇక బాలికల అక్రమ రవాణా 38 శాతం పెరిగిందని నివేదిక పేర్కొంది. 156 దేశాలకు చెందిన డేటాను ఈ నివేదిక విశ్లేషించింది. ప్రపంచవ్యాప్తంగా 2022లో ఈ అక్రమ రవాణా బాధితుల్లో మహిళలు, బాలికలు 61 శాతం వున్నారని వెల్లడించింది. వీరిలో 60శాతం మంది బాలికలను లైంగిక దోపిడీ కోసమే బలవంతంగా తరలించారని పేర్కొంది. ఆన్‌లైన్ కుంభకోణాలతో సహా బలవంతంగా నేరాలకు పాల్పడేలా చేయడం కూడా బాగా పెరిగిందని పేర్కొంది. 2016లో ఇటువంటి నేరాల సంఖ్య కేవలం ఒక్క శాతమే వుండేదని 2022నాటికి 8శాతానికి పెరిగిందని నివేదిక తెలిపింది. ఇందుకు పాల్పడేవారిని జవాబుదారీగా చేయడానికి బలోపేతమైన క్రిమినల్ జస్టిస్ చర్యలు తీసుకోవాల్సి వుందని యుఎన్ఓడిసి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఘడా వాలీ పిలుపిచ్చారు. బాధితులను కాపాడేందుకు, దీన్నుండి బయటపడిన వారికి సాయమందించేందుకు దేశాల మధ్య సహకారం కూడా పెరగాల్సి వుందన్నారు.

# కరిగిపోక ముందే కళ్లు తెరుద్దాం!

**ముహమ్మద్ వహీదుద్దీన్**

**మనిషి** జీవితంలో వెలకట్టలేనిదీ, తిరిగి రానిదీ కాలం (సమయం). కాలం విషయంలో అంతిమ దివ్యఖుర్ఆన్ మనిషి గురించి రెండు సందర్భాలను ప్రస్తావించింది. ఆ సందర్భంలో మనిషి పశ్చాత్తాప పడతాడు. అప్పుడు చెందే పశ్చాత్తాపం ప్రయోజనం చేకూర్చదని. దైవ గ్రంథం చెబుతుంది.

**మొదటి సందర్భం :** మనిషి మరణం సమీపించినప్పటిది. అప్పుడు మనిషి ప్రపంచాన్ని వీడి పరలోకం వైపు ప్రయాణం సాగిస్తుంటాడు. అప్పుడు మనిషి, "అయ్యో! అల్లాహ్ నాకు ఈ ప్రపంచంలో ఇంకాస్త వ్యవధిని ప్రసాదించి, ఇంకొన్నాళ్లు మరణం నుంచి విముక్తి కలిగించి జీవితం ప్రసాదిస్తే నా తప్పులను సరిదిద్దుకొని నన్ను నేను సంస్కరించుకుంటాను" అని పశ్చాత్తాపం చెందుతాడు.

ఇలాంటి వారి గురించి దివ్యఖుర్ఆన్ ఇలా తెలియజేసింది: 'విశ్వసించిన ప్రజలారా! మీ సిరిసంపదలూ, మీ సంతానమూ, మిమ్మల్ని అల్లాహ్ స్మరణ నుంచి మరల్చరాదు. ఎవరైతే ఇలా మరల్చబడతారో వారే నష్టానికి గురయ్యేవారు. మీలో ఎవరికైనా మరణ సమయం సమీపించి, అతను "ఓ నా ప్రభూ! నీవు నాకు మరి కొంత వ్యవధి ఎందుకివ్వలేదు! నేను దానధర్మాలు చేసి సజ్జనులలో కలిసిపోయేవాణ్ణి కదా!" అని వాపోయే పరిస్థితి రాకముందే మేము మీకు ఇచ్చిన ఉపాధి నుంచి ఖర్చు పెట్టండి'. (దివ్య ఖుర్ఆన్ 63 : 9-10)

ఇలాంటి కోరిక కోరేవారికి అల్లాహ్ దివ్యఖుర్ఆన్లో ఇలా సమాధానం చెబుతున్నాడు. ఎవరి ఆచరణ వ్యవధి అయినా ముగిసిపోయే సమయం ఆసన్నమైనప్పుడు, అల్లాహ్ ఇక అతనికి ఎంతమాత్రం అదనపు వ్యవధి ఇవ్వడు. మీరు చేసేదంతా అల్లాహ్‌కు బాగా తెలుసు. (దివ్య ఖుర్ఆన్ 63: 11)


**రెండవ సందర్భం :** అల్లాహ్ పరలోకంలో మనుషులందరినీ హాజరు పరిచినప్పటిది. ఆనాడు ప్రతి ఒక్కరి జీవితం గురించి లెక్క తీసుకోవడం జరుగుతుంది. పుణ్యాత్ములు స్వర్గంలో పాపాత్ములు నరకంలో పడవేయబడతారు. అప్పుడు నరకవాసులు అల్లాహ్‌తో... ఓ అల్లాహ్! ఒకవేళ నీవు మమ్మల్ని ఒకసారి ప్రపంచంలో తిరిగి పంపిస్తే మేము సత్కార్యాలు చేస్తాం అని కోరుకుంటారు. విచారకరమైన విషయం ఏమిటంటే వారి ఆచరణ సమయం ముగిసి, ప్రతిఫల దినానికి వారు చేరుకున్నారు. కాబట్టి వారి కోరిక నెరవేరదు. అందుకే అల్లాహ్ ఎవరికి ఎంత సమయాన్ని బహూకరించాడో, ఆ సమయాన్నే సద్వినియోగం చేసుకోవాలి.

కాలం వేగంగా పరుగెడుతుంది. గడిచిపోయిన కాలం పోయిన ప్రాణంలాంటిది. ప్రపంచంలో అన్నిటికి ప్రత్యామ్నాయం ఉండవచ్చు. కానీ కాలానికి ప్రత్యామ్నాయమంటూ ఏమీ లేదు. కొందరు సమయాన్ని బంగారంతో పోలుస్తారు. కానీ, బంగారం, వెండి, వజ్ర వైఢూర్యాలన్నింటి కంటే చాలా అమూల్యమైనది కాలం.

ఇమామ్ హసనుల్ బన్నా షహీద్ (రహ్మతుల్లా) సమయం గురించి ఇలా తెలిపారు. సమయమే జీవితం. మనిషి జీవితం సమయంతోనే ముడిపడి ఉంది. మనిషి పుట్టుక నుంచి మరణం వరకు గల జీవితకాలమే సమయం.

హసన్ బస్రీ (రహ్మతుల్లా) సమయం గురించి ఇలా తెలియజేశారు– ఓ మనిషి! నీవు కొన్ని దినాల, కోసమే ఇక్కడికి వచ్చావు. ఒక రోజు గడిచిపోతే నీ జీవితంలోని ఒక భాగం గడిచిపోయినట్లే'. ఓ అల్లాహ్ సమయ పాలనగావించే బుద్ధి జ్ఞానాలను ప్రసాదించు!

ఆమీన్ య రబ్బులాలమీన్!!




Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2023-2025 Phone: 24564583. **e-mail : geeturaiweekly@gmail.com**